జూన్ - 2022

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక


గౌరవ సంపాదకులు :

**కె. సామ్యేల్ రాజేంద్ర**

సంపాదకులు :

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

చందా వివరాలు :

సంవత్సర చందా రూ. 250/-

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-



చిరునామా :

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లౌపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9866716506



బ్యాంక్ అకౌంట్ వివరాలు :

A/c Name: **K. Samuel Rajendra**


A/c No.: **10957294362**

Bank: SBI Main Branch, Ongole


IFSC Code : SBIN0000890


## విషయసూచిక


| | |
|---|---|
| సంపాదకీయం ఎడిటర్ | 02 |
| జప్పత్పనేహు కొడవటికంటి | 03 |
| మనిషికోమాట.... | |
| ఇమ్మానియేలు రాజేంద్ర | 06 |
| మిక్కిలి సాత్వికుడు | |
| కొడవటికంటి | 07 |
| దేవుడు - సిరి | 09 |
| సమరయస్త్రీ | 10 |
| తృణీకరింపబడుతున్న ప్రేమ | 12 |
| సాక్ష్యము జోసఫ్ కిషోర్ | 14 |
| ఆదాము హవ్వ చిన్నపిల్లల కథ | 18 |
| ఘనపరచుట | 20 |
| లోకంతీరు | |
| ఇమ్మానియేలు రాజేంద్ర | 22 |

# సంపాదకీయం.....



హన్నాకృప పాఠకులకు వ్యవస్థాపకుడు కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర నమస్కారములు.

జూన్ నెల సంపాదకీయం మొదలు పెట్టక ముందు - 2రాజులు 18:5 "అతడు (హిజ్కియా) ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా యందు విశ్వాసముంచిన వాడు . అతని తరువాత యూదా రాజులలోను అతని పూర్వీకులైన రాజులలోను అతనితో సమమైనవాడు ఒకడును లేడు....". అంటే దావీదు, అతని తర్వాత రాజులు చూపలేని ధైర్యసాహసాలు చూపి, "అతడు యెహోవాతో హత్తుకొని ఆయనను వెంబడించుటలో వెనుతీయక మోషే ఆజ్ఞాపించిన ఆజ్ఞలన్నిటిని గైకొనుచుండెను." ఇశ్రాయేలు జనాంగమంతా నెహుష్టానును ప్రాణదాతగా పూజిస్తున్నారు. అది దేవుని చిత్తం కాదు అని హిజ్కియాకు తెలుసు. దానిని కదిలిస్తే విప్లవం వస్తుందని, ప్రజలు తిరగబడతారని అందరూ భయపడ్డారు. కానీ నెహుష్టానును కదిలించుటకు హిజ్కియాకు దేవుని యందు విశ్వాసం ఉన్నది. అదే అతనికి ముఖ్యం. కాబట్టి దానిని ఛిన్నాభిన్నము చేశాడు. అంత సాహసంగా విశ్వాసక్రియ జరిగేటప్పుడు ప్రజలలో అలజడి వస్తుంది. ఇప్పుడు సన్హెరీబు రాజు దండెత్తి వచ్చాడు. సామాన్య ప్రజలందరూ, హిజ్కియా దేవుని చిత్తమునకు వ్యతిరేకమైన పని చేశాడు అనుకున్నారు. హిజ్కియాకు దేవుని యందు ఉన్న విశ్వాసమే ఆయనను నిలబెట్టింది.

మనము ప్రారంభించిన ఏ పనైనా, విశ్వాసము లేకపోతే దానిని కొనసాగించలేము, అందులో ఎదురయ్యే సమస్యలను జయించలేము. ఇంతకాలం, 19 సం॥ల నుండి హన్నాకృపను నడిపించింది ఆ విశ్వాసమే. ఇప్పుడు మరల ప్రారంభిస్తున్న ఈ పత్రికను దేవుడు తన దాసుని ద్వారా జయకరంగా నడిపిస్తాడని నమ్ముతున్నాను. ఏ ఆటంకమైనా, ఎవరి వలన ఆటంకమైనా అది నిలబడదు. మన విశ్వాసాన్ని దేవుడు స్థిరపరచు గాక!

–కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర, ఎడిటర్

K. Samuel Rajendra, SBI Collector Office Branch, Ongole
**A/c No. 10957294362**

సీరియల్

# జఫ్నత్పనేహు

(యోసేపు జీవితచరిత్ర)

– కొడవటికంటి

అమ్మ సమాధి పదిమంది నడిచే దారిలో ఉంది. ఆ రోజు అమ్మ సమాధి స్థంభం కట్టడం పూర్తి అయిన తర్వాత తండ్రి అన్న మాటలు గుర్తొచ్చాయి. 'బాట ఎన్ని సంవత్సరాలైనా బాటయే. బాట వెడల్పవుతుంది. ఎన్ని వేల సంవత్సరాలైనా ఈ సమాధి రాహేలు ప్రేమ నిధి. ఏమో! ఎన్నివేల సంవత్సరాలైనా ఈ సమాధి ఇట్లాగనే ఉంటే ఎన్ని కోట్లమంది దీనిని చూస్తారో!'

'ఎఫ్రతా!' అదే బేత్లెహేము. చిన్నగ్రామమైనా పంటలకి కొదువులేదు. ఎవరో యెబూసుకు బేత్లెహేము పొలాల నుండి గడ్డి తోలుకొని వెళ్తూ పలకరించారు. "ప్రొద్దుపోయింది యెబూసుకు చేరు కుర్రాడా" అని అరిచారు.

ఐగుప్తు కదిలింది. కదులుతూ తన నేస్తాన్ని కదిలించింది. యోసేపు యెబూసుకు చేరుకునేటప్పటికి సూర్యుడు ముప్పై మైళ్ళ దూరాన ఉన్న మధ్యధరా సముద్రంలో మునిగిపోయాడు. తండ్రి చెప్పిన ఆచూకి ప్రకారం ఆ ఇంటిలో అతనికి బస దొరికింది.

తను తెచ్చిన జున్ను కొంత, వేయించిన గోధమలు కొన్ని ఆ ఇంటివారికి ఇచ్చాడు. తన కొరకు పెద్దమ్మ సిద్ధం చేసిన భోజనం ఆ ఇంటివారు తిననివ్వలేదు. వారి వేడి రొట్టెలు, మాంసం మంచి రుచిగా ఉన్నాయి. రోజంతా ప్రయాణంలో అలసిపోయినా ఆహారం బాగానే తీసుకున్నాడు. ఆ మట్టి మిద్దెపైన నిలుచుని చుట్టూ చూశాడు. చంద్రుడు పూర్తిగా ప్రకాశిస్తున్నాడు. ఆ వెలుతురులో యెబూసు గ్రామం చుట్టూ పర్వతాల వంటి కొండలు ఉన్నాయి. ఒక్కొక్క కొండకు ఒక్కొక్క పేరు పెడితే ఎంత బాగుంటుందో!, యొర్దాను ఎంత లోతులో ప్రవహిస్తుంది! యొర్దాను ప్రాంతం – పలకరించే స్నేహితునిలాగా తోచింది.

వెంటనే తన తాత మదిలో మెదిలాడు. నిన్న ఉదయం తను తాత దగ్గరికి వెళితే ఒళ్ళంతా తడిమిచూశాడు. ఆయనకు అసలు చూపు లేదు. అన్నల ఆచూకి కోసం తను షెకెము వెళ్తున్నానంటే తాత అస్సలు ఒప్పుకోలేదు. "పనివాళ్ళు చాలామంది ఉన్నారు, వాళ్ళు వెళతారు. నువ్వు మాత్రం వెళ్ళవద్దు" అని గట్టిగా చెప్పాడు. పిచ్చితాత! నిజమే పిచ్చితాత కాకపోతే తన తండ్రి అబ్రాహాముగారితో కలిసి తన వయస్సులోనే బెయేర్షెబా నుండి మూడురోజులు ప్రయాణం చేసి ఈ కొండలలో ఒక కొండకి చేరుకున్నాడు. ఇది నూటఇరవై సంవత్సరాల క్రితం సంగతి.

తన తాత ఇస్సాకు వాళ్ళ నాన్న అబ్రాహాము గురించి ఎన్నో విషయాలు కథలుగా చెప్పాడు. అందులో ఈ మోరీయా కొండల ప్రయాణం ఒకటి. అప్పుడు ఆయనకు తన వయస్సే, అంటే పదిహేను నుండి పందొమ్మిది లేక ఇరవై సంవత్సరాల వయస్సు ఉండి ఉండవచ్చు.

బెయేర్షెబాలో అబ్రాహాము తాత, అవ్వ శారాలు గొప్ప ఆస్థితో నివసించేవారు. ఆయన ఒక రాజే. పెద్ద సైన్యం కూడా ఉండేది. వారిలో శూరులైన వారే మూడువందల పద్దెనిమిది మంది ఉండేవారు. చాలా బంగారం, వెండి, దాసదాసీ జనములు, పశుసంపద ఉండేవి. ఒకరోజు ఉదయాన్నే ఇంకా చీకటిగా ఉన్నప్పుడే అబ్రాహాముగారు ఇస్సాకుగారిని నిద్రలేపి ప్రయాణం అవమన్నాడు. ఇస్సాకు తాత ఒక్కమాట కూడా అడక్కుండానే ఏదో అవసరమైన పని అని సిద్దపడుతుంటే అబ్రాహాముగారు స్వయంగా కట్టెలు చీల్చుతుంటే అప్పుడు అనుకున్నాడు–ఇదేదో బలిపీఠము కార్యక్రమము అని. కొంచెంసేపటికి ఇక ఇద్దరు పనివారు కూడా ప్రయాణానికి సిద్ధమయ్యారు గాడిద మీద చీల్చిన కట్టెలు వేశారు. అంటే ఖచ్చితంగా దహనబలికే!

మూడవరోజున కాని అబ్రాహాముగారు నోరు విప్పలేదు. ఈసారి ఇస్సాకు తాతకి నిజంగానే చాలా అనుమానాలు ఉన్నాయి. మొదటిది తన తండ్రి ఎంతో గంభీరంగా ఉన్నాడు. ఆ గంభీరానికి అర్థం విచారమా? తెలియలేదు. రెండవది, చీల్చిన కట్టెలు గాడిద మీద వేసి, పూర్తిగా రెండు రోజులు

మోరీయా దేశమునకు ఎందుకు నడవాలి? మూడవది, పనివాళ్ళను బలి అర్పించే ఉన్నత స్థలమునకు ఎందుకు తీసుకొని రావటం లేదు? ఇంతకుముందు ఎన్నోసార్లు దహనబలి ఇచ్చినప్పుడు అందరూ చూస్తుండే వారు. మరి ఇప్పుడు తను, తండ్రి మాత్రమే ఎందుకు వెళ్ళాలి?

తను ఇప్పుడు బరువు మోస్తున్నాడు. చాలా బరువుగానే ఉంది. చాలా ఎత్తైన కొండ ఇంకా ఎక్కవలసి ఉంది. అయితే తండ్రి – దహనబలి పశువును మర్చిపోయాడు. సహజంగా తను మితభాషి. తన తల్లి శారా అలా పెంచింది. ఒకసారి తన తల్లి అనవసరంగా నవ్వి దేవునితో అబద్ధమాడింది. తండ్రి – చేత్తో కత్తిని, నిప్పును పట్టుకొని నడుస్తున్నాడు. ఇస్సాకు తాత చిన్నప్పటినుండి కష్టం చేయకుండా పెరిగాడు. ఇప్పుడు కట్టెలు మోయవలసినందుకు విసుక్కోలేదు. పైగా చేస్తుంది దైవకార్యమని కనబడుతుంది. ఇదేమైనా కొత్తరకం బలియాగమా? ఏదేమైనా కత్తి, కట్టెలు, నిప్పు ఉన్నాయి కాని బలిపశువు కనిపించదే? ఆ కొండ మీద వేటాడి బలియిస్తాడా? అది సాధ్యమా? తండ్రిని అడుగుదామనుకున్నాడు. కాని ధైర్యం చాల్లేదు.

అయినప్పటికి ధైర్యం చేసి "నా తండ్రి!" అని పిలిచాడు. నీరసంగాను, భయంగాను ఉంది. అబ్రాహాము గారు బలమైన మనిషి. వయస్సు పైబడినా మనిషిలో శక్తి క్షీణించ లేదు. కట్టెలు కుమారుని మీద పెట్టడం తనకిష్టం లేదు. అయినా ఇది దైవాజ్ఞ. దేవుని ప్రేమ రుచి చూసినవాడు. ఆయన వెయ్యిమందిలో మాట్లాడినా అది అబ్రాహామునకు మాత్రమే వినిపిస్తుంది. తన స్వరము మానవులందరూ వినాలని ఆయన సంకల్పము. కాని వినగల చెవులు ఎవరికున్నాయి?

"నా తండ్రి!" అని పిలిచిన పిలుపు ఎక్కడనుండో వేగంగా వచ్చి గుండెల్లో గుచ్చుకొనిన బాణంలాగా తగిలింది. అవును, ఆ స్వరము తన కుమారునిదే. తనని ఇంత మాధుర్యంగా పిలిచిన స్వరము ఇక కొంతసేపటి తర్వాత వినబడుతుందా? ఇష్మాయేలు కూడా ఇలానే పిలిచేవాడు. అయితే అతని స్వరము, అతని గాడిద పరుగులాగా దూకుడుగా ఉండేది. కాని ఇస్సాకు స్వర మార్ధవము – మాధర్యము.

"ఏమి, నా కుమారుడా?" అని అడిగాడు. కాని కుమారుని ముఖంలోకి చూడలేదు. పుట్టిన దగ్గర్నుంచి తన కుమారుని ముఖం ఘడియకు ఎన్నిసార్లు చూశాడో? ఎన్ని ముద్దులు పెట్టాడో? శారా తన కుమారుని వదలి ఒక్కరోజు కూడా గడుపలేదు. తన భర్త తన కుమారుని తనకంటే జాగ్రత్తగా చూసుకొని తిరిగి తనకు అప్పగించగలడని నమ్మకం. దేవుని మీదలాగానే భర్తమీద విశ్వాసం కలిగి ఉండేది.

"నిప్పును, కట్టెలును ఉన్నాయి. కాని దహబలికి గొఱ్ఱెపిల్ల ఏది?" అని తనలో తానుగొణుక్కున్నట్లుగానే పైకి అన్నాడు.

అబ్రాహాము కాళ్ళు కొంచెం తడబడ్డాయి. అవును దహనబలి గొఱ్ఱెపిల్ల...? వాగ్దానం చేసినవాడు నమ్మదగినవాడు. ఇస్సాకు వలననైనదే నీ సంతానమనబడునని అన్నాడు. దేవుడు అబద్ధమాడడు. దహనబలి పశువు ఇస్సాకైతే తర్వాత సంతానం లేదే? మృతునిలో నుండి సంతానం వస్తుందా? మృతుని మృత్యుంజయుని చేసే శక్తి దేవునికి లేదా? మృతతుల్యునిలో నుండి ఈ కుమారుని రప్పించినది ఆయనే. వాగ్దానము చేసిన దానిని నెరవేర్చగల సమర్థుడు.

ముందు ఇస్సాకును బలి అర్పించితే, దహనబలిగా దేవునికి ప్రతిష్టిస్తే, ఆ బలిపీఠము బూడిదలో నుండి జీవము గలిగిన ఇస్సాకును మరలా ఇవ్వగలడు. శరీరుడైన తన కుమారుని దేవుని బలిపీఠము నుండి మరలా సంపాదించు కొని ఆత్మీయకుమారుని అనగా శరీరము ఆత్మ మిళితమైన కుమారుని పొందాలా? అది సాధ్యమా? ఆ రోజు మమ్రే దగ్గర సింధూర వృక్షము క్రింద ప్రభువు అన్నమాట తన జీవితంలో ప్రతిక్షణం ప్రతిధ్వనిస్తుంది – "యెహోవాకు అసాధ్యమైనది ఏదైనా ఉన్నదా?'అని. నిజమే తన జీవితంలో తను మౌనియై ఆయన రక్షణ కొరకు ఎదురుచూచి రక్షింపబడలేదా?

కుమారుని వైపు చూశాడు. తల వంచుకొని భుజము మీద కట్టెల భారంతో నడుస్తున్న ఇస్సాకును చూచాడు. క్షణకాలం విశ్వాసం వెల్లివిరిసింది. ఔను తన కుమారుడైన ఇస్సాకుని తను ప్రేమిస్తున్నాడు. అయితే ఈ క్షణంలో క్రొత్త

సత్యము, అంటే తనకు క్రొత్తగా బయలు పర్చబడిన సత్యం – ఇస్సాకు తనకు ఇవ్వబడిన దేవుని కుమారుడు, తను కేవలం దేవునికొరకు పెంచవలసిన కుమారుడు. కుమారుని తనకంటే తన దేవుడు ఎక్కువగా ప్రేమిస్తున్నాడు.

"నా కుమారుడా! దేవుడే దహనబలి గొఱ్ఱెపిల్లను చూచుకొనును"అన్నాడు ఇస్సాకుతో. దేవుడు–తనకు, శారాకు నింద తొలగించుటకు అనుగ్రహించిన ఈ దీవెన ఇస్సాకు. అతని వలననైనది అబ్రాహాము సంతానము. ఇస్సాకు దేవుని సంతానం. కనుక దేవునికి చెందినది ఆయనకు చెల్లించి ఆయన దగ్గర నుండి పొందవలసినదే. క్షణభంగురమైన ఈ మానవ జన్మ దేవుని వలన నిత్యత్వ మును సంపాదించుకుంటుంది. ఈ ఆలోచన తనకు ఇంత కుముందున్న హృదయభారమును తొలగించినది. వికలమైన మనస్సు పదిలపరచ బడింది. ఇంతవరకు దేవుని ఆజ్ఞను తన శక్తితో నెరవేర్చాలని చూశాడు. దేవుని ఆజ్ఞలు భారమైన వి కావు. మనము వాటిని నెరవేర్చుటకు శక్తిని ఆయన దగ్గర మాత్రమే పొందగలము. కుమారుని ప్రశ్నతోనే తనకు కనువిప్పు కలిగింది. ఔను, తన జ్ఞానంతో, తన భక్తి, తన విశ్వాసంతో, దేవుని మీద తన గౌరవంతో ఆయనని పూజించలేమని తెలుసుకున్నాడు.గత 50 సం॥లుగా తనలో జీవించుచున్నది సంపూర్ణమైనది. ఇస్సాకును బలి ఇచ్చే కార్యక్రమము ద్వారానే తన యొక్క ఆత్మీయ స్థితికి, సంపూర్ణత చేకూరింది. దేవుని సంకల్పం సంపూర్ణంగా బయలుపరచబడుతుంది. ఇప్పుడు ఇస్సాకును చూస్తే తన కుమారునిలా కాక దహనబలి గొఱ్ఱెపిల్లలా కనిపించాడు. అప్పటికి కొండమీదకు వచ్చాడు. బలిపీఠము కట్టడానికి పనికి వచ్చే రాళ్ళ సముదాయము దగ్గర ఆగాడు. రాళ్ళు పేరుస్తుంటే ఇస్సాకు రాళ్ళు అందిస్తున్నాడు.బలిపీఠం కట్టడం పూర్తయింది. మొదటిజాము గడచి రెండవజాములో ప్రవేశించబోతున్నారు.

అబ్రహాము ఇస్సాకు చెయ్యి పట్టుకున్నప్పుడు, ఆ పట్టుకున్న చెయ్యి బలహీనమైనట్లుగా వణుకుతుంది. చూపు సరిగానే ఉంది. కళ్ళనిండా నీళ్ళు ఉన్నాయి. ఇస్సాకుకు అర్థం అయింది–పనివారిని దూరంగా ఎందుకు ఆపి వేశాడో, కట్టెలు తనతోనే ఎందుకు మోయించాడో. ఇది దైవకార్యమా? అవును, కాకపోతే తండ్రి ఇలా ఎందుకు చేస్తాడు? పసిపిల్లలవలె దేవునికి లోబడాలని, వాదన లేకుండా దేవునికి తలవంచాలని, తన తండ్రి తనకు ఎన్నిసార్లు చెప్పలేదు! తండ్రి తనని బంధించేటప్పుడు, తనను బంధించనవసరం లేదు అని చెప్పాలనుకున్నాడు. కాని తండ్రి ముఖం చూడలేననుకున్నాడు. ఆయన ఇప్పుడు అమితమైన దుఃఖంలో ఉన్నాడు. చేతులు వణుకుతూనే ఉన్నా తనని బంధించి పేర్చిన కట్టెలమీద పండుకోబెట్టి నపుడు తన ముఖం అటు ప్రక్కకు త్రిప్పుకొని కళ్ళు మూసు కున్నాడు. తండ్రి కత్తి పట్టుకున్న శబ్ధము విన్నాడే కాని ఇంకా ఏమి జరుగులేదు. తన తండ్రి తనని గట్టిగా కరచుకొని ముద్దుపెట్టుకొని ఏడుస్తూ కట్లు విప్పదీస్తున్నాడు. ఆయన కళ్ళు ఆనందంతో మెరుస్తున్నాయి. దేవుడే దహనబలిని చూచుకొనును అంటే వెనుకకు చూచినప్పుడు పొదల్లో కొమ్ములు తగులు కొనియున్న పొట్టేలు కనిపించిం ది. ఇప్పుడు ఇస్సాకు కూడా తండ్రితో దహనబలి కార్య క్రమంలో పాల్గొన్నాడు.

తన తండ్రి, తను కలిసి మరలా నడుస్తూ పనివారి దగ్గరకు వస్తున్నప్పుడు అబ్రాహాము జరిగిన సంగతంతా ఇస్సాకుతో చెప్పాడు. వధించుటకు తన చెయ్యి చాచి కత్తి పట్టుకోగానే, అబ్రాహామా! అబ్రాహామా! అని యెహోవా దూత పరలోకము నుండి తనను పిలిచింది. నీకు ఒక్కడైయున్న నీ కుమారుని నాకియ్య వెనుదీయలేదు. గనుక నీవు దేవునికి భయపడువాడవని, దీనివలన నాకు కనబడు చున్నదని అనిందట. అప్పట్నుంచి ఏ ఒడిదుడుకులు లేకుండా దేవుడు అబ్రాహామును అన్ని విషయాలలో ఆశీర్వదించటం, తాతయ్య పెళ్ళి జరగటం, తన తండ్రి యాకోబు పారిపోవటం అన్నీ తనకు తాత ఇస్సాకే చెప్పాడు. ఈరోజు తను ఈ మోరీయా దేశంలోనే తన తాత, ఆయన తండ్రి కలిసివచ్చిన కొండ ఈ కొండలలో ఒకటి తనకు దగ్గరగా ఉండి ఉండవచ్చు. అప్పుడప్పుడు ఇస్సాకు తాత తనతో అంటుండేవాడు, మా నాన్న అంతా వాళ్ళ తాత అబ్రాహాము పోలికేనని. విశ్వాసం, ఆ పట్టుదల అన్నీ వాళ్ళ తాత అబ్రాహాము గుణాలేనని. ఆ రాత్రి అక్కడ హాయిగా నిద్రపట్టింది. ఉదయాన్నే మిద్దెమీదకు వెళ్ళాడు.

**(సశేషం)**



# మనిషికో మాట...



మనిషికో మాట అనగానే గొడ్డుకో దెబ్బ అని తడుము కోకుండా చెప్పేస్తారు కదా! కాని ఆ సామెత అబద్ధం. గొడ్డుకో మాట మనిషికో దెబ్బ అనేది కరెక్ట్. ఎందుకంటే ఏ పెంపుడు జంతువైనా సరే, యజమాని ఒక్కసారి చెప్తే మాట వింటుంది. కానీ, కన్నబిడ్డలైనా సరే, వందసార్లు చెప్పినా మాట వినరు. మరి మనిషికో మాట అనేది అబద్ధమే కదా! మాట వినక పోవడమన్నది ఏదెను తోటలో నుండే ప్రారంభమయ్యింది. దేవుడు చెప్పిన మాట ఆదాము, హవ్వలు వినలేదు. మాట వినకపోవడం వలన వచ్చిన ఫలితాన్ని వాళ్ళు అనుభవించారు. దేవుడిచ్చిన సుఖవంతమైన జీవితాన్ని వదులుకొని అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి రావడానికి మాట వినకపోవడమే కారణ మయ్యింది. సౌలు దేవుని మాట వినకపోవడం వలన రాజ్యాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ఇప్పుడు మనం అనుభవించే కష్టాలకి బాధలకి కూడా దేవుని మాట వినకపోవడమే కారణం. మనుష్యులు ఎన్ని కష్టాలు అనుభవించడానికైనా, చావడానికైనా సిద్ధపడు తున్నారు గానీ, దేవునికి మాట వినడానికి, ఆయనకు లోబడి ఉండటానికి ఏ మాత్రం ఇష్టపడటం లేదు. 'దేవున్ని' ఎంచుకోవడం వలన ఇప్పుడు మనం అనుభవిస్తున్న సుఖాలన్నిటికీ దూరమై, సన్యాసుల్లాగా బ్రతకాల్సి వస్తుందేమో అన్న అపోహ మనుష్యులకి ఉన్నందు వలన దేవుని వైపు మొగ్గు చూపడం లేదు. అది నిజంగా కేవలం అపోహ మాత్రమే. ఇప్పుడు మనం ఏవైతే సుఖాలు అనుభవిస్తున్నామో అవన్నీ దేవుని సృష్టిలోనివే. అవన్నీ మనం దేవుని ద్వారా కాకుండా మన స్వశక్తి ద్వారా, అంటే ధనము ద్వారా సంపాదించుకోవాలనుకుంటాము. అందుకే దేవునికి వ్యతిరేకమైన పద్ధతిలో సమస్తము సమకూర్చుకుంటాము. దేవుని మాట విని, దేవునికి లోబడి ఉండటం ద్వారా దేవుడు దయచేసే వాటి వలన మనకి ఎలాంటి సమస్యా ఉండదు. మనం దేవుని సంరక్షణలో ఉన్నప్పుడు దేవుడు మనకి, మనకు కలిగిన సమస్తమునకు ఒక కంచె వేస్తాడు. *'నీవు అతనికిని అతని యింటివారికిని అతనికి కలిగిన సమస్తమునకును చుట్టు కంచె వేసితివి గదా?' (యోబు 1:10)* అని సాతాను యోబు గురించి చెప్పింది. ఎందుకంటే యోబు దేవుని మాట విని, ఆయనకు లోబడి ఉండి, ఆయనయందు భయభక్తులు కలిగి, ఆయన సంరక్షణలో ఉండటం వలన దేవుడు ఆయనకు కంచె వేశాడు. యోబుకు వచ్చిన కష్టాలన్నీ దేవుడు అనుమతిస్తే వచ్చినవే. యోబు చాలా ఆస్తిపరుడు, సర్వసమృద్ధి కలిగినవాడు. దేవుడు యోబుని శోధించిన తర్వాత ఆయన ఆస్తిని రెట్టింపు చేశాడు. దేవుని సంరక్షణలో ఉన్న యోబు గొప్పతనం, విశ్వాసం, లోకమంతా తెలుసుకోవాలని దేవుడు తాత్కాలికంగా సాతానుకి అప్పగించాడు. మనకి వచ్చే కష్టాలని యోబు కష్టాలతో పోల్చుకోకూడదు. ఎందుకంటే మనం దేవుని సంరక్షణలో లేకుండా, దేవుని మాట వినకుండా మనకు నచ్చినట్లుగా ఉండటం వలన మనకు మనమే దేవుని కంచెలో నుండి బయటకు రావడంవల్ల సాతాను చేతికి మనల్ని మనమే అప్పగించుకుంటున్నాము. మన పెంపుడు జంతువులకి కేవలం తిండి పెడితేనే మనపట్ల విశ్వాసం చూపించి మన మాట వింటాయి కదా. మరి ఈ సృష్టి మొత్తాన్ని మనకోసం చేసిన దేవునిపట్ల మనం విశ్వాసం చూపించక, మాట వినక పోవడం వల్లనే మనకి దెబ్బ మీద దెబ్బ పడుతుంది. ఈ దెబ్బలకి అలవాటు పడాలా, దేవుని మాట వినాలా అన్నది నిర్ణయించుకోవాల్సింది మనమే.

ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు

**9866716506**

సీరియల్

# మిక్కిలి సాత్వికుడు

– కొడవటికంటి

(మోషే జీవిత చరిత్ర)

గుడారము పైనుండి ఎండ, ముఖము పై పడి మెలుకువ వచ్చింది. తప్పు చేసినదానివలె లేచి ఇంత పొద్దెక్కే వరకు ఎలా పడుకున్నాను? అనుకుంటండగా, తన చేతికి తగిలిన మెత్తటి దిండు, తాను పడుకున్న మెత్తటి పరుపే కారణం అని అర్థమైంది. రాత్రి తన ఇంటి వద్ద కాకుండా ఇక్కడ...? రాత్రి ఆసిమా అమ్మ తల దువ్వి జడ వేసింది. నా వయస్సు 45 సం॥లు పైనే అయినా రాత్రి తనను యవ్వనస్తురాలు వలె తయారు చేసింది. తరువాత పది మంది పెద్దలు కలసి తనను మోషే గారి గుడారములోనికి తీసుకొని వచ్చారు. అప్పుడు అర్థమైంది తనకు మోషేగారితో వివాహం జరిగిందని.

మోషే గారు మా ఇతియోపియా దేశం వచ్చి మా బంధువలనందరిని ఐగుప్తు తీసుకొచ్చాడు. అప్పుడు తనకు 8 సం॥ల వయస్సు. మోషేగారు ఎప్పుడు తనను ప్రక్కనే కూర్చోబెట్టుకునే వాడు. తనకి కూడా మోషే గారంటే ఆత్మీయ భావం. అమ్మ, నాయనా, అక్కలు అందరూ పరాయివారి వలె అయిపోయారు. మోషే గారు ఒక్కరే సొంతమైనట్లు అనిపించేది. మోషేగారు ఎవరికి చెప్పకుండా దేశం వదిలిపోయిన తరువాత ఆయన రాజకుమారుడు కాదని తెలిసింది. ఎవరేమి చెప్పినా తను నమ్మలేదు. ఆయన రాజకుమారుడు కాకపోతే దైవకుమారుడు అనుకుంది. తనకు 40 సం॥ల వయస్సు వచ్చినపుడు మోషేగారు, వారి అన్న యాజకుల వలె ఐగుప్తుకు వచ్చి దేవుని పని చేస్తున్నారు. మోషే గారు తిరిగి వచ్చినందుకు సంతోషం కలిగినా, మనుపు చూచిన యోధుని వంటి శరీర ధారుఢ్యం కలిగి అందంగా, బలంగా, లావుగా ఉన్న మోషేగారే తనకు నచ్చాడు. ఇప్పుడు ఆయన ముఖంలో ఏ భావము లేదు.

చిన్నప్పటి నుండి మోషే ఐగుప్తు రాడు అని అందరు చెప్పుకునేవారు. ఆయన ఐగుప్తీయుని చంపి, పారిపోయాడని తెలిసింది. పారిపోయాడు అని చెప్తే వినడానికి బాగుండదు. ఐగుప్తీయుని చంపి పోయాడు. మళ్ళీ వస్తాడని తనకు ప్రగాఢమైన విశ్వాసం. తన చిన్నతనంలో మోషేగారు తన ఇంటికి తీసుకెళ్ళినప్పుడు యోకెబెతు అమ్మ మోషేని పెళ్ళి చేసుకుంటావా అని అడిగేది నవ్వుతూ. తనకు ఆ మాట అసహ్యంగా అనిపించేది. ఆయన వయస్సులో పెద్దవాడు. ఆయనకంటే 40 సం॥లు చిన్నదానిని. అయినా మోషే గారి భార్య అవ్వడం అంటే అది అసాధ్యమైన పని. మేము కూషు దేశస్తులము, ఆయన ఐగుప్తీయుడు కాబట్టి వివాహం అసాధ్యం. ఆయన ఐగుప్తీయుడు కాదు, ఇశ్రాయేలీయుడు అని తెలిసిన తర్వాత దేశం వదిలి పారిపోయాడు. ఆయన మిద్యాను దేశంలో ఉన్న రోజుల్లో ఆయనకు వివాహం జరిగి ఇద్దరు పిల్లలు పుట్టారు. అంతకంటే ఎక్కువ ఆలోచించేది ఏమీ లేదు.

ఇప్పుడు ఐగుప్తుకే వచ్చాడు. పారిపోయిన వాడు వచ్చినట్లు భయం, భయంగా రాలేదు, సైన్యంతో రాలేదు. ఈ ఐగుప్తును పరిపాలిస్తున్న దేవునిలా వచ్చాడు. చాలా సం॥లు ఫరోతో ఆయనకు తగాదా ఉండినది. ప్రతిసారి మోషే గారి మాటే చెల్లేది. మోషే ఐగుప్తు రాజు కాకుండా వెళ్ళిపోయినా, ఐగుప్తీయుల దృష్టలో మోషే ఘనుడు. తన దృష్టిలో దేవుని ప్రతీక. తరువాత కొంత కాలానికి దాదాపు 30,40 లక్షల మంది ఇశ్రాయేలీయులను ఐగుప్తు నుండి వెలుపలికి నడిపించిన నాయకుడైనాడు. అహరోను యెహోషువ (హోషేయ), కాలేబు, హూరు, వంటి పెద్దలు ఆయన చుట్టూ ఉండేవారు. ఆయనను రాజులా చూసేవారు.

మిద్యానీయురాలైన సిప్పోరా అందం చూడదగినది. మోషేగారి కొరకు దేవుడు తయారు చేసిన స్త్రీ. ఆమె తనను ఎంతో ప్రేమగా చూసేది. ఎప్పుడూ ఆమె దగ్గరకు

పిలిపించుకొని తనతో సమయం గడిపేది.

అప్పుడు అరణ్య ప్రయాణం మొదలై ఆకాశము నుండి ఆహారము కురుస్తున్నది. సిప్పోరా అమ్మ బలహీనంగా ఉంది. అనారోగ్యం ఏమీ లేదు. మోషే గరికి ఏమి చెప్పాలన్నా, తనకు చెప్పి చేయించేది. వారం రోజులక్రితం సిప్పోరా అమ్మ కొంతమంది ఘనులైన స్త్రీలతో కలసి వచ్చి మోషే గారిని ఎల్లప్పుడు అంటిపెట్టుకొని ఉండే సాటియైన సహాయాన్ని కావాలని బ్రతిమాలుతూ చెప్పారు. నా మనసు, మెదడు పని చేయలేదు. ఆసిమా అమ్మ ఇది దేవుని చిత్తమమ్మా అని చెప్పింది. దేవుని చిత్తమైతే తను కాదన కూడదు. అమ్మ అబద్ధం చెప్పదు. తనకు శరీరాశలు లేవు. అవన్నీ చిన్నతనం నుండే మరచిపోయింది.

మోషే, సిప్పోరా అమ్మల గది చాలా ఎత్తులో కట్టబడింది. మూడు వరసల దేరాలతో కట్టబడి లోపల చల్లటి వాతావరణం, క్రింద బరువైన దిండ్లు, తివాచీలు. రాత్రి పడుకోగానే నిద్రపడుతుంది.... తన దుస్తులు కాని, అలంకరణ కాని ఏది కదల్చబడలేదు. తెల్లవారి ఎండబడిన తర్వాత మెలుకువ వచ్చింది. మోషే గారి కొరకు చూస్తే అప్పటికే న్యాయశాలకు వెళ్ళిపోయారు. సిప్పోరా అమ్మ వచ్చింది. ఆమె వచ్చి తన ప్రక్కనే కూర్చుని తల నిమిరింది. ప్రేమగా, మోషేగారు నీతో ఏమి మాట్లాడారు అని అడిగింది. ఇంతటి మెత్తటి దిండ్లు, పరుపులు, చల్లని వాతావరణం. పండుకోగానే నిద్రపోయాను అమ్మ అన్నది. సిప్పోరా నవ్వి, నీవు చేయాల్సిన పనులన్నీ కూడా నీవు నెరవేర్చాలి. ఇప్పుడు నీవు నా స్థానానికి వచ్చావు. దేవుడు నీకు సహాయం చేస్తాడు. మోషేగారి కొరకు దేవుడు నిన్ను కూషు దేశములో పుట్టించి ఇక్కడకి తీసుకొని వచ్చాడు. నువ్వు పెద్దదానివైనావు. మోషేగారి భార్యవైనావు అని ఆయనకు హృదయంలో సంచలనం కలిగించాలి. చాలా ప్రొద్దు గడిచింది లేచి స్నానం చేసి భోజనం చేయమ్మ అన్నది.

సిప్పోరా చిన్న చేయి గంట మ్రోగించింది. ఇద్దరు యవ్వన స్త్రీలు వచ్చారు. వారికి ఏదో సైగ చేసింది. వారు వచ్చి అక్కాకు వంగి నమస్కారం చేశారు. అక్కా ఆశ్చర్యపోయింది. ఇన్నాళ్ళు తను వారిలో ఒకతెగా పెరిగింది. ఈ రోజు మోషే భార్య అయినందున వారి దృష్టి మారిపోయింది. వారిద్దరు వస్త్రములు తీసుకొని వచ్చి తనను స్నానాల గదిలోనికి నడిపించుకొనిపోయారు. స్నానం ముగించి వచ్చిన తర్వాత తను ఎన్నడూ తినని ఆహారం భోజనంగా పెట్టారు. అది రాజ భోజనం. తన కొరకు ఎప్పుడు ఇద్దరు యవ్వన స్త్రీలు కాచుకొని ఉండేవారు. సిప్పోరా తన దగ్గరకు వచ్చి, అక్కా నీకు ఏ పని కావలసిన నీవు చేసుకోకూడదు. పనివారిని పిలిచి చెప్పాలి. ఒంటరిగా బయటకు వెళ్ళకూడదు. మోషేగారు ఎక్కడున్నారో నీ హృదయం అక్కడ ఉండాలి. మోషేని నీవు జ్ఞప్తి ఉంచుకోని ఏ క్షణమైనా మరణించిన దానితో సమానం అన్నది. అంతలో కాలేబు గారి భార్య, యెహోషువ గారి భార్య బయట వేచియున్నారని పనివారు చెప్పగా అక్కా, సిప్పోరా వైపు చూసింది. అక్కా అమ్మగారు ఉదయకాల భోజనం చేస్తున్నారని చెప్పమని పనివారికి ఆజ్ఞాపించింది సిప్పోరా. తర్వాత తన తల్లియైన ఆసిమా అమ్మ వచ్చిందని పనివారు చెప్పగా, సిప్పోరా లేచి వాకిట దగ్గరకు వచ్చి ఆసిమాను లోపలికి తీసుకెళ్ళింది.

అక్కా, సిప్పోరా, ఆసిమా ముగ్గురు కలసి అన్నం తింటుండగా, అహరోను గారి భార్యయైన ఎలీషెబ గారు వచ్చారు. ఆమెను చూడగానే అహరోను కుమారులైన నాదాబు అబీహులు చనిపోయారనే విషయం గుర్తుకు వచ్చి అక్కా సన్నగా ఏడ్వటం మొదలుపెట్టింది. అహరోను భార్య అక్కా దగ్గరకు వచ్చి ఆమెను హత్తుకొని సన్నగా ఏడుస్తుంది. అహరోను కుమారులు దేవుని గుడారములో పొరపాటు చేసి ఒక్కరోజే ఇద్దరు మరణించారు. ఆ విషయం అందరికి గుర్తుకు వచ్చి వాతావరణం పూర్తిగా దుఃఖపూరితమైంది

అందరూ కూర్చున్న తరువాత సిప్పోరా ఇప్పుడు మోషేగారి భార్యను చూడనివారు ఆసక్తితో చూడడానికి వచ్చారు కాబట్టి ప్రార్థనా కూటము పెడదాము అన్నది.

**(సశేషం)**

# దేవుడు - సిరి

రాజులను జయించి తిరిగి వస్తున్న అబ్రాహామును షాలేము రాజైన మెల్కీసెదకు రొట్టెను, ద్రాక్షారసమును తీసుకొనివచ్చి ఆశీర్వదించాడు. యాజకునిగా వచ్చిన మెల్కీసెదకుకు, అబ్రాహాము దేవుని పేరిట అన్నిటిలో దశమ భాగము ఇచ్చాడు.

అబ్రాహాము మనుమడు యాకోబు. యాకోబు సాధువై గుడారాలలో నివశించుచుండెను. 16 సంllల వయస్సు వచ్చే వరకు యాకోబు అబ్రాహాము దగ్గరే పెరిగాడు. యాకోబుకు 60 సంllలు దాటే వరకు వివాహాము చేసుకో లేదు. తన తల్లి యొక్క ఆజ్ఞను అనుసరించి తన తండ్రి వద్ద నుండి ఆశీర్వాదములు గ్రహించి తల్లిదండ్రుల ఆజ్ఞ ప్రకారం పద్దనరాముకు ప్రయాణమయ్యాడు. దారిలో ఓ రాత్రి దేవుని దర్శనం చూచాడు. తెల్లవారిన తర్వాత దేవునికి ప్రార్ధించి, ముగింపులో దేవునితో నీవు నాకిచ్చు యావత్తు నుండి పదియవవంతు నిశ్చయంగా నేను చెల్లించెదను అని మ్రొక్కుకున్నాడు. చెల్లించడం అంటే ఇతరులకు ఉచితంగా ఇచ్చేదానం కాదు. మనం ఎవరికైనా ఏదైనా అచ్చి యున్నప్పుడు వారికి మనం చెల్లిస్తాము అంటే చెల్లు - ఇస్తాము. దేవుని దగ్గర నుండి తీసుకొనిన వాటిలో మనం మళ్ళీ దేవునికి పదియవభాగం ఇవ్వడమేమిటి? అబ్రాహాము అయితే దేవుని పేరిట ఎదురుగా ఉన్న మెల్కీసెదకు అనబడిన సర్వోన్నతుడైన దేవుని యాజకునికి ఇచ్చాడు. యాకోబు ఒంటరిగా ఉన్నాడు. చేతి కర్ర తప్పితే అతని వద్ద ఏమి లేదు. ఏమీ లేనప్పుడు అతనికి అబ్రాహాము ద్వారా సంప్రా ప్తించిన దేవుని మీద విశ్వాసమున్నది.

దేవుడు బీదవాడు కాదు. దేవుడే యాకోబుకు ఆహారం, వస్త్రం ఇవ్వాలి. అలా ఇస్తే వాటిలో పదవభాగం మళ్ళీ దేవునికే ఇస్తానని ఒప్పందపడుతున్నాడు. దేవుడు ఇతనికి నేనిచ్చిన వాటిలో నాకు దశమభాగం ఇవ్వమని ప్రసంగం చేయలేదు. నీవిచ్చే దశమభాగము డబ్బుతో నా సువార్తికులు - సేవకులు బ్రతుకుతారయ్యా. నేను వాళ్ళకివ్వడానికి నా దగ్గర డబ్బులు లేవయ్యా! అని అనటం లేదు. మానవులకు దేవుడిచ్చిన ఆజ్ఞలు అన్నీ వాటిని అనుసరించడానికే! అప్పుడు వారు జీవిస్తారు. ద్వితి. 8:3 ప్రకారం ఆహారము వలననే కాక, యెహోవా సెలవిచ్చిన ప్రతిమాట వలన నరులు బ్రతుకుదురు అని నీకు తెలియ జేయుటకు... అని చెప్పి యున్నాడు. కనుక దేవుడు మనకిచ్చిన ఆజ్ఞలన్ని అవి దేవుని కొరకు కాదని, వాటివలన మనం జీవిస్తామని దేవుడు సెలవి స్తున్నాడు.

నాకు పరిచయమైన తరువాత ఆప్తులుగా ఎంచబడిన వారిని - నీవు దశమభాగము తీస్తున్నావా? అని అడిగి నప్పుడు చాలామంది సంతృప్తి కరమైన జవాబు ఇవ్వలేదు. అయితే మా పాఠకులకు విజ్ఞప్తి ఏమిటంటే - దశమభాగము ఖచ్చితంగా వేరుపరిచేవారిని గమనించండి, అడగండి, వారి జీవితాలు ఎలా ఆశీర్వదించ బడినవో! ఇంతకంటే మనకు నిదర్శనము ఏమి కావాలి? డాక్టర్లు కాని, లాయర్లు కాని మనకిచ్చే సలహాలు మన మంచి కొరకేనని మనం తప్ప కుండా నమ్ముతాము. అదే విధంగా దేవుని ఆజ్ఞలు పాటించ డానికి అవి కష్టంగా కనిపించినా వాటిని మనం కూడా ఆచరిస్తే ఆ దీవెన మనం అనుభవించిన తర్వాత మనం కూడా ఇతరులతో ఆ దీవెన పొందాలని వారికి చెబుతాము.

యాకోబు దేవునితో దశమభాగము ఒప్పందము చేసుకున్నాడు. పద్దనరాములో అతని అభివృద్ధికి అతని మామ లాబాను ఎన్నో అసాధ్యమైన అడ్డంకులు కల్పించాడు. కాని దేవుడే తన తరపున పనిచేసి అతని ఆస్తిని లెక్కించ లేనంతగా అభివృద్ధి చేశాడు. యాకోబు తన అన్నకు కానుక గా పంపిన వాటి విలువ ఇప్పటి లెక్కలో రెండున్నర కోట్ల రూపాయలు. అతను పద్దనరాము నుండి తిరుగు ప్రయాణం లో - నా చేతి కర్రతో మాత్రమే ఈ యొర్దాను దాటితిని. ఇప్పుడు నేను రెండు గుంపులైతిని అని ప్రార్ధన చేశాడు. యాకోబును ప్రేమించిన దేవుడు నన్ను నిన్ను అదే మోతాదులో ప్రేమిస్తున్నాడు.

స్త్రీల విభాగము

# సమరయ స్త్రీ

సమరయ స్త్రీ ఉదంతము క్రైస్తవ ప్రసంగాహారసరళిలో పలువన్నెలు వెదజల్లు మేలైన ముత్యము వంటిది. సండేస్కూలు మొదలు వేదాంత కళాశాల వరకు ప్రతి విద్యార్థికి ఉత్సుకత నింపే కథావాహినిలో అలరించిన తరంగము వంటిది. ఈమె వృత్తాంతము వలన క్రైస్తవ సంఘము అనేక సత్యములతోను భావపూరిత వేదాంత సిద్ధాంతములతోను ప్రయోగాను చిత్త పరిచర్య విధానములతో దీవించబడి అనేక ఆత్మలను క్రీస్తు సన్నిధికి నడిపించిన ప్రయోజనాత్మక సాధనమై యున్నది.

ఆరవ వానితో కులుకుచున్నదను నెపముతో సమాజ బహిష్కృతమైన పంచభర్తృక, మండుటెండలో మట్టి కుండతో మంచినీటికై బావికొచ్చింది. ఆమె కొరకేనన్నట్టు బావిచెంత వేచియున్న యేసుప్రభువు ఆమెను పలుకరించాడు. దాహమునకై నీరిమ్మని సాదరముగా వేడుకున్నాడు. ఈ సందర్భమున వారిరువురి మధ్య కొనసాగిన సంభాషణ విశేషకరం, వినోదభరితం మరియు విప్లవాత్మకం, అతి సంగ్రమైన వారి సంభాషణలో సమరయస్త్రీ ఐదు సంశయముల ను లేక భావములను వ్యక్తపరిచింది. ఆ సంశయములు ఆమె ఆత్మీయ పురోగమన సోపానములుగా నిలచి ఆమెను తన ఆధ్యాత్మిక చింతనా శిఖరాగ్రమునకు చేరుకునేలా చేశాయి.

ఆ ఐదు సంశయములలో సమరయస్త్రీ వ్యక్త పరచిన పరివర్తన క్రైస్తవ జీవన విధానానికి ప్రతీకగా నిలచింది. ఆ అంశయములను శ్రద్ధతో పరిశీలిద్దాము.

**1. మొదటి సంశయము** – శతృభావము.

"యూదుడవైన నీవు సమరయస్త్రీనైన నన్ను దాహమున కిమ్మని ఏలాగు అడుగుచున్నావు?" యోహాను 4:9

ఈ సంశయములో శతృభావము తేట తెల్లముగా యున్నది. సమరయస్త్రీ యేసుప్రభువు ను కేవలము ఒకజాతి వైరిగా పరిగణించుచున్నది.

నిజమే, ఆ దినములలో యూదులకును సమరయులకును బద్ధ విరోధము చెలరేగుచున్నది. యూదులు సమరయులను కులహీనులుగను, మత భ్రష్టులుగను యెంచి వారితో సాంగత్యము చేయక వారికి యెరూషలేము దేవాలయ ప్రవేశము నిషేధించియుండిరి. సమరయులతో సాంగత్యము హేయమైన కార్యముగా యెంచి యుండిరి. అలాగే సమరయులు యూదులను అహంకారులుగను, మతోన్మాదులుగను యెంచి ఆదరించక వారిని శతృవులుగా భావించుచుండిరి. ఇట్టి పరిస్థితుల యందు సమరయస్త్రీ యేసుప్రభువు పై వెలువరిచిన శతృభావము ఉచితమే, అందుకే యూదుడనైన నీకు సమరయురాలనగు నేను నీరివ్వడము ఏమిటి? అంటూ ఆయన వినతిని మొహమాటము లేకయే తిరస్కరించింది. క్రైస్తవులుగా మనము అప్పుడప్పుడూ అలాంటి పొరపాట్లు చేస్తుంటాము. ఏ కారణము లేకయే వర్ణభేదములని, ప్రాంతీయ భేదములని యితరులను శతృవులుగా భావించి వారిని కించపరచుట – మనము అనేక సమయములలో గమనించ గలము. ఈనాటి అపరిచతుడు రేపటి స్నేహితుడు కావచ్చు గదా!

**2. రెండవ సంశయము**– స్నేహభావము.

"అయ్యా!యీబావి లోతైనది చేదుకొనుటకు నీ కేమియులేదే ఆ జీవజలము నీ కెలాగు దొరకును?" యోహాను 4:11

శతృవుగా నెంచి నీరిచ్చుటకు తిరిస్కరించిన సమరయస్త్రీ యేసు ఉదారముతో పలికిన పలుకులతో ఓ మెట్టు దిగింది, శతృభావము స్నేహభావమైంది. ఆయనపై కోపించక ఒక స్నేహితునితో మాట్లాడురీతిగా చేదుకొనుటకు నీ యొద్ద యేమియు లేవు కదా అంటూ హాస్యధోరణిలో ప్రభువునకు సన్నిహితురాలయింది.

సువార్త పరిచర్యలో ప్రతి విశ్వాసి గమనించదగిన విషయమిది. సాదరమగు మాటలు ఎదుటి వ్యక్తులందు స్నేహభావమును పెంపొందించుతాయి. నోరు మంచిదయిన ఊరు

మంచిదను నానుడి అక్షరాలా నిజం. ప్రేమతో కూడిన మాటలు శతృవుని సైతం కైవశం చేసుకొనగలవు. ఇదే విషయాన్ని అపొస్తులుడైన పౌలు తిమోతికి ప్రత్యేకంగా వ్రాసియున్నారు. నీ సంభాషణ ఉప్పు వేసిన రీతిగా రుచి కరముగా వుండాలి.

**3.మూడవ సంశయము–** సహోదర భావము

"ఈ బావి నీరు త్రాగి మాకిచ్చిన మన తండ్రియైన యాకోబుకంటె నీవు గొప్పవాడవా?" యోహాను 4:12

సంభాషణ శతృభావముతో మొదలై ఆ పిమ్మట స్నేహ భావాన్ని అంకురించుకుంది. ఇప్పుడు స్నేహభావము సోదర భావముగా సంతరించుకుంది. పితరుడైన యాకోబును మన తండ్రియని సంబోధించుటలో క్రీస్తుప్రభునకు తాను సోదరిగా పరిచయం చేసికుంటుంది. మనతండ్రియైన యాకోబు ద్వారా మనము రక్తసంబంధులమని యేసునకు సమీపమయినది.

యాకోబునకు పన్నెండుమంది కుమారులు. వారు పన్నెండు గోత్రకర్తలుగా పరిగణింపబడుచున్నారు. ఇశ్రాయేలు దేశము రెండుగా చీలిన సందర్భమున పదిగోత్రములు ఉత్తరమున ఇశ్రాయేలు రాజ్యముగను యూదా మరియు బెన్యామీను రెండు గోత్రములు దక్షిణమున యూదా రాజ్యము గాను ఏర్పడినవి. ఉత్తరమునగల పదిగోత్రములు (ఇశ్రాయేలు దేశము) అస్సీరియనుల చే చెరపట్టబడి అనేక సంవత్సరాల తర్వాత తిరిగి సమరయ ప్రాంతములో స్థిరపడిరి. వీరే సమర యులు. చరిత్ర నెరిగిన సమరయస్త్రీ తన బాంధవ్యమును గమనించి యేసు ప్రభువును సహోదరునుగా గుర్తించుటలో ఆమె ఆధ్యాత్మిక చింతన మరోమెట్టు ఎదిగింది. యేసు సన్నిధిలో వర్ణ విభేదములకు, జాతి వైరములకు తావులేదు. సకల మానవాళిని ఏకం చేయగలశక్తి ఉన్నది. అంటే అది కేవలము యేసుసన్నిధియేనని మనము గ్రహించాలి. కాని ఈ రోజులలోక్రైస్తవ సంఘములలో జాతివైరములు, కుల భేదములు పాతేసుకొని సంఘములను ఖండ ఖండములుగా విభజించుచున్నవి. అగ్రజాతి క్రైస్తవులని, నీచ జాతి క్రైస్తవులని సంఘము విభాగింపబడియున్నది. యూదుడని, గ్రీకుడని, యజమానుడని, దాసుడని, స్త్రీయని, పురుషుడని, ఏ భేదము లేదు –అను వాక్యభాగము కేవలం చదువుటకే గాని అను సరణ యోగ్యము కాదని నానాటికి స్పష్టమగుచున్నది. భారత దేశంలో, అందునా తెలుగు రాష్ట్రంలో కొందరు ఉద్యోగరీత్యా హైందవులుగను, సంఘాధిపత్యము నిమిత్తమై క్రైస్తవులుగాను ద్విపాత్రాభినయం కొనసాగించుట కదు శోచనీయం. సమరయ స్త్రీ అలాంటి అడ్డుగోడలను కూలద్రోసింది.

**4. నాలుగవ సంశయము–** గురుభావము

"అయ్యా! నీవు ప్రవక్తవని గ్రహించుచున్నాను. మా పితరులు ఈ పర్వతము మీద ఆరాధించిరిగాని ఆరాధించు స్థలము యెరూషలేములో ఉన్నదని మీరు చెప్పుదురు." యోహాను 4:19,20

వైరభావముతో ప్రారంభమయిన సమరయస్త్రీ ఆత్మీయ పయనం, స్నేహభావముతో సరిదిద్దబడి, సహోదర భావంతో అంటుకట్టబడి, గురుభావముతో మొగ్గ తొడిగింది. తన గత జీవిత వికృత వివాహ విన్యాసాల వివాహానంతరం ఆమె యేసుప్రభువును ప్రవక్తగా గుర్తించింది. తన ఆంతరంగిక విశేషాలను సునాయాసంగ వివరించగల ప్రవక్తయని ఆయన ను ఒక గురువుగా గణించి ఇహ సంబంధమైన ప్రశ్నలతోగాక ఆధ్యాత్మిక ప్రశ్నగా తన సంశయమును వెల బుచ్చింది. ఆరాధన అనగా ఏమిటి? ఎలా? ఎక్కడ? అను ప్రశ్నలకు ప్రతీకగా వెలువడిన సంశయమే ఇది. అందుకు నిర్ణీత స్థలము, సమయములేదు, నిజమైన ఆరాధన – సత్యమైనది, ఆత్మీయమైనది.

ఈనాడు సంఘములలో నిజమైన ఆరాధన కొదువుగా యున్నది. డినామినేషన్ పేరిట ఆరాధనలు వక్ర మార్గము లను అనుసరించుచున్నది. సంగీతము ఆరాధన పీఠమును సంతరించుకున్నది. ఆత్మతో సత్యముతో గాక అహముతో విత్తముతో ఆరాధనలు కొనసాగుచున్నవి. సంఘకాపరులు నిర్వీర్యులై ఆరాధన స్థలములో అల్లరి దురాక్రమమునకు దోహదము కల్పించుచున్నారు.

**5. ఐదవ సంశయము–** దైవభావము.

"క్రీస్తనబడిన మెస్సియా వచ్చునని నేనెరుగుదును." యోహాను 4:25

**(మిగితాది 17వ పేజీలో)**

# తృణీకరింపబడుతున్న ప్రేమ

అతనో పేదవాడు, కాని మంచితనంలో తనంత ధనికుడు ఎవరూ లేరు. తానో మొరటోడు కాని తనకున్నంత మెత్తని మనసు మరొకరికి లేదు. అతనికి కష్టమంటే ఏంటో తెలుసు. ఆకలి ఎలా ఉంటుందో ఇంకా బాగా తెలుసు. అందుకే తన బిడ్డ తనలా బ్రతకకూడదని, కడుపు మంటతో మాడకూడదని తలంచేవాడు. తాను పేదవాడై నప్పటికీ తన కూతురు మాత్రం పైకి రావాలని కలలు కనేవాడు.

తాను చేసేది కూలిపని. తన బిడ్డ మాత్రము ఎన్నడూ కూలి పని చేయకూడదని గొప్పగా ఊహించుకొనేవాడు. అందుకే అది ఎంత కష్టమైనా తనకున్న ఒక్కగానొక్క కూతుర్ని బాగా చదివించాలని, గొప్ప చేయాలని తలంచి స్కూలు చదువైన వెంటనే పై చదువులకు తన కూతుర్ని పట్టణానికి పంపించాడు. ఒరేయ్! నీ కూతుర్ని పట్నం పంపిస్తున్నావు డాక్టర్ని చేద్దామనా? లేక కలెక్టర్ని చేద్దామనా? నీకే పూట గడవడం అంతంత మాత్రం, ఆశకైనా హద్దులుండాలిరా! అని ఓ పెద్దాయన అంటుంటే హృదయంలో ఎంతో నొచ్చుకున్నాడు. తాను పేదవాడిననేగా వీరికి ఇంత లోకువ. ఏం! పేదవాడి కూతురు చదువుకో కూడదా? పేదవాడి కూతురు డాక్టరు కాకూడదా? ఏమైనా సరే! నా రక్తం చిందించైనా నా కూతుర్ని డాక్టర్ని చేస్తాను. గొప్ప దానిగా చూస్తాను. నాలాగ నా బంగారుతల్లి కష్టపడ కూడదు. ఆకలిమంటలో అలమటించకూడదు. అనేక మంది ఆకలి తీర్చేదిగా నా కూతురు కీర్తిని సంపాదించాలని ఆశపడి తన కూతురుకు 'కీర్తి' అని పేరు కూడా పెట్టుకున్నాడు.

ఏమే మీ నాన్నగారు ఏం చేస్తారు? అని అడిగింది గీత. మా నాన్నగారు వ్యవసాయం చేస్తారు. మాకు రెండు ఎకరాల పొలం వుంది. దాన్ని చూసుకుంటారు అని అంది స్నేహ! మరి మీ నాన్నగారు అని ఎదురు ప్రశ్న వేసింది. మా నాన్నగారు ఆర్.ఎం.పి. డాక్టరు. మాది మధ్య తరగతి కుటుంబం అని జవాబిచ్చింది గీత. స్నానంచేసి బయట కొచ్చిన కీర్తిని చూసి వాళ్ళు, కీర్తి మీ నాన్నగారు ఏం చేస్తుంటారని ఒక్కసారిగా అడిగారు. అందుకు కీర్తి ఎంతో గర్వంగా నవ్వుతూ మా నాన్నగారు మా ఊరి ప్రెసిడెంట్, మాకు 25 ఎకరాల పొలము ఉంది. మా ఇంట్లో ఎంతో మంది కూలివాళ్ళు పని చేస్తారు. మా గురించి చెప్పాలంటే చాలా వుందిలే అన్నది. కీర్తి అలా మాట్లాడుతుంటే ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయిన గీత, స్నేహల నోట మాట రాలేదు. గీత, స్నేహ మాత్రం చక్కగా చదువుకునే వారు. కాని కీర్తి సరిగా క్లాస్‌లకు అంటెండయ్యేది కాదు. సరిగా చదువుకోదు. పంపించిన డబ్బంతా సినిమాలకు, హోటల్ తిండికి సరిపోతుండేది. పైగా అబ్బాయిలతో స్నేహము, వారితో సినిమాలకు హోటల్స్‌కెళ్ళడం వంటివి చేస్తూ హాస్టల్‌కి చాలా ఆలస్యంగా వచ్చేది. కొన్ని రాత్రులు అసలు వచ్చేది కాదు. నువ్వేదో బాగా చదువుకుంటావని, పైకొస్తావని మీ నాన్నగారు నిన్ను పట్టణానికి పంపిస్తే నువ్వు ఈ విధంగా తిరగడం మంచిది కాదు అని స్నేహ గీతలు మందలించగా, అందుకు కీర్తి 'చూడండీ! జీవితం అనేది ఐస్‌క్రీమ్‌లాంటిది. టైమ్‌కి అనుభవించకపోతే కరిగి పోతుంది'. ఈ వయస్సు ఈ సరదాలు మరలా జీవితంలో తిరిగి రావు. కనుక ఎంజాయ్ చేయాల్సిన సమయంలో ఎంజాయ్ చేయాలి అని వాళ్ళ నోళ్ళు మూయించేది.

తన దుబారా ఖర్చులకు తన తండ్రి పంపించే డబ్బులు సరిపోక, ఇంకా డబ్బులు కావాలని పుస్తకాలు కొనుక్కోవాలని, ప్రైవేటు క్లాసులకు ఎక్స్‌ట్రా ఫీజులు చెల్లించాలని ఏవేవో కట్టుకథలు అల్లి ఉత్తరాలు వ్రాసేది. అక్కడ కూలినాలి చేసుకొని కడుపు నింపుకునే తండ్రి తన కూతురు కష్టపడ కూడదని కాలేజి ఫీజు నిమిత్తము ఒక పూట భోజనం చేయటం ఎప్పుడో మానేశాడు. ఇప్పుడు ఇంకా డబ్బులు పంపాలంటే కొన్ని రోజులు సాంతం పస్తులుండాల్సిందే! తండ్రి కడుపు మాడ్చుకొని మంచి నీళ్ళతో కడుపు నింపుకొని తన కూతురు గొప్పగా చదువుకొని

కీర్తి సంపాదిస్తే అదే చాలు. నేను ఉంటే ఏమి, ఊడితే ఏమి అని ప్రతి పైసా కూడబెట్టి తన కూతురికి పంపేవాడు. కీర్తి తన స్థితి, గతి ఎప్పుడో మర్చిపోయింది. అహం, గర్వంతో కళ్ళు కానక జీవించడం మొదలుపెట్టింది.

కన్నకూతుర్ని చూసి చాలాకాలం అయింది. ఎలా వుందో ఒకసారి వెళ్ళి వద్దామని తన కూతురికి ఇష్టమైన లడ్డులు, చకోడీలు తయారు చేసుకొని, ఎప్పుడు కూతుర్ని చూస్తానా? అని ఆత్రంగా పట్టణం బయలుదేరాడు. నా కూతురు బాగా చదువుకుంటుంది, నా ఆశలను, నా ఆశ యాలను, పరువును నిలబెడుతుంది, పేదవాడు కూడా తన కూతుర్ని గొప్ప చదువు చదివించగలడని నా కూతురు నిరూపిస్తుందని కలలు కంటూ, కాలేజీ హాస్టల్‌కు చేరాడు. అమ్మా! ఇక్కడ కీర్తి మా అమ్మాయి ఎక్కడ వుంది అని ప్రశ్నించాడు గీతను. గీత ఆశ్చర్యపడుతూ... కీర్తి మీ అమ్మాయా? ఒక గంటలో వస్తుంది అని జవాబిచ్చింది. ఆ గంట ఎంత త్వరగా అవుతుందా? అని ఎప్పుడు తన కూతురును చూస్తానా? అని వేయి కళ్ళతో ఎదురుచూశాడు.

ఎప్పుడో పొద్దున తిన్నాడు చద్దన్నం. ఒక ప్రక్క అలసటతో కంటికి కునుకు పడుతున్నా తన కూతురు కోసం కళ్ళార్పకుండా చూస్తున్నాడు. గంటయింది, రెండు గంట లయ్యింది... రాత్రి 12 గంటలకు ఏదో మోటారు సైకిల్ శబ్దమైతే గేటు దగ్గర కూర్చున్న తండ్రి ఆశతో చూశాడు. ఓ కుర్రాడి బైక్ మీద నుండి ఆ అమ్మాయి క్రిందకి దిగి హాస్టల్‌కి రాబోతుంటే... వాడు తన కూతురు చేయి పట్టుకుని లాగటం తన కళ్ళముందే సరసాలాడటం చూసి గుండె ద్రవించిపోయి, కుప్పకూలిపోయాడు. ఆ ప్రక్కన కూర్చున్నది తన తండ్రని గ్రహించక తన తండ్రి ముందు నుంచే హాస్టల్‌కు వెళ్ళిపోయింది కీర్తి. ఏమే! నీ కోసం మీ నాన్నగారు వచ్చారు చూశావా? అని అడిగింది గీత. మా నాన్నగారా? చూద్దాం రా! అని గీత, స్నేహలతో కలిసి క్రిందికి వచ్చింది కీర్తి. అప్పటికే సగం చచ్చిపోయిన ఆ ముసలాయనను చూచి నిద్రపోతున్నాడేమో అనుకొని ఈయన మా నాన్నకాదు, ఈయన మా ఇంట్లో పనివాడు. నేను మాట్లాడి వస్తాను మీరు పదండి అని వారిని పంపించి, ఎందుకు హాస్టలుకి వచ్చావు. డబ్బులు పోస్టులో పంపవచ్చుగా అని విసుక్కుంటూ, నాలుగు చీవాట్లు పెట్టి తన తండ్రి దగ్గర్నుండి తనకు కావలసిన డబ్బులు తినుబండారాలు తీసుకొని ఆ రాత్రికి రాత్రే తండ్రిని పంపివేసింది. నడుస్తున్నాడు కానీ, తన కళ్ళముందు ఆ కుర్రాడు, కూతురు బరితెగించిన... ఆ దృశ్యం, ఇతను మా నాన్నకాదు పనివాడు అనే మాటలు, తన చెవుల్లో మారుమ్రోగుతూ శూలాల్లాగా గుచ్చుకుంటున్నాయి. అడుగు వేయలేక పోతున్నాడు. ఆ పేద గుండె క్షోభను తట్టుకోలేకపోయింది...

ప్రొద్దున హాస్టల్ దగ్గర్లో వున్న రైలు పట్టాల దగ్గర జనం మూగారు. కాలేజీకి వెళ్తూ ఏం జరిగిందో చూద్దాం అని గీత, స్నేహలతో కలిసి జనంలోంచి తొంగి చూసింది కీర్తి. ఇంకెవరు? తన తండ్రి! నాన్నా.... అంటూ ఏడుద్దామంటే పనివాడని అబద్ధం చెప్పాను. ఇప్పుడు నాన్న అంటే ఉమ్మేస్తారు. తన కళ్ళముందే మున్సిపాలిటీ వారు తన తండ్రి శవాన్ని తీసుకెళ్తుంటే... కన్న కూతురి కన్నీటికి కూడా నోచుకోని ఆ పేద తండ్రి దిక్కుమాలిన వాడిగానే తీరని లోకానికి వెళ్ళిపోయాడు.

ప్రియ చదువరీ! నీ తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకొని, వారి రక్తాన్ని చెమటగా మార్చి నీవు బాగా చదువుకోవాలని, బాగుపడాలని నిన్ను కాలేజికి పంపిస్తే నీవు చేస్తుందేమిటి? నువ్వు కూడా కీర్తిలాగే జీవిస్తే ఆ తండ్రి కూడా కీర్తి తండ్రిలాగే...! ఊహించగలవా...?

ఈలోక తల్లిదండ్రులనే కాక, నీ సంరక్షణ కొరకు నీకు వారిని దయచేసిన పరమ తండ్రియైన దేవుని ప్రేమను తృణీకరిస్తూ, ఇహలోక ఆశల నిమిత్తం దేవునిపై నీ ప్రవర్తన ద్వారా తిరుగుబాటు చేస్తూ ఆయనను బాధపెడుతున్నావు. దయచేసి, నేడైనా దేవునియందు భయభక్తులు కలిగి యోసేపు వలె పాపానికి రాజీపడక గొప్ప కీర్తిని సంపాదించి క్రైస్తవ లోకం గర్వించే విధంగా దేవునికి మహిమకరంగా జీవించి నీ తల్లిదండ్రులను సంతోష పెడతావని ఆకాంక్షిస్తున్నాం.

నీ యౌవనేచ్ఛలను విడచి పారిపొమ్ము. పవిత్ర హృదయులై ప్రభువునకు ప్రార్థన చేయు వారితో కూడా నీతిని, విశ్వాసమును, ప్రేమను, సమాధానమును వెంటాడుము' (2తిమో. 2:22).

సాక్ష్యము

# నన్ను స్థిరపరచిన ప్రభువు

గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం నర్సరావు పేటకు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న పొనుగుపాడు గ్రామము మా స్వగ్రామము. మా ఊరిలో అధిక జనాభా వ్యవసాయము చేసి జీవిస్తారు.

మా తండ్రిగారు, వారి పితరులు అందరూ వ్యవ సాయం చేసి జీవించారు. మాకు మాగాణి మెట్ట కలసి పది ఎకరాలు ఉంది. మా తండ్రిగారు గుజ్జుం శేషారాయుడు మా తల్లిగారు నాగేశ్వరమ్మ. మేము ముగ్గురు సంతానం. మా అక్క పద్మావతి, నా పేరు రమేష్‌బాబు, తమ్ముడు సత్య నారాయణ. నేనొక్కడినే చదువుకున్నాను. మా వూరి జిల్లా పరిషత్ హైస్కూల్లో పదవ తరగతి చదివి నరసరావుపేటలో కాలేజీ చదువు సాగించాను. నా పన్నెండవ ఏట నుండి నాలో కమ్యూనిస్టు భావాలు తలెత్తాయి. అందువల్ల కాలేజి చదివేటప్పుడు పార్టీ విషయాలు గోడల మీద వ్రాసేవాడిని. నా స్నేహితులతో కలసి పార్టీ మీటింగులు పెట్టేవాడిని. మా తండ్రిగారు నా విషయంలో చాలా అసహనంగా ఉండేవారు. చిన్నతనం నుండి బొమ్మలు గీయటం, రకరకాలుగా అక్షరాలు వ్రాయటం, ఫోటోలు తీయటం అంటే ఇష్టం.

మా తండ్రిగారు వ్యవసాయం చేస్తూనే వేదాలు వల్లించే వాడు. మంత్రం, తంత్రం చేసేవాడు. రామభక్తుడని ఆయనకు పేరుంది. పెళ్ళిళ్ళు చేసేవాడు, కవిత్వం చెప్పేవాడు. నాకు అయిదవ సంవత్సరంలోనే పాము మంత్రం నేర్పించాడు. నన్ను అన్ని విషయాల్లో ఆయనవలె వుండాలని కోరేవాడు. అందుకని వ్యవసాయం చేయమని నన్ను పిలిచేవాడు. మా అక్కకి పెళ్ళి అయిపోయిన తరువాత నన్ను చదువు మాని వ్యవసాయం చెయ్యమన్నాడు. మా తండ్రితో కుదరలేదు. కష్టపడి పని చేయకపోతే ఇంట్లో స్థానం లేదన్నాడు. మా ఊర్లోనే మాకొక పాత ఇల్లు ఉంది. దానిని బాగు చేసికొని అందులో ఫోటో స్టూడియో పెట్టి వేరుగా ఒంటరిగా జీవించ సాగాను. ఆరునెలల తర్వాత తండ్రి పిలిచినా పోలేదు. ఆ విధంగా మూడు సంవత్సరాలు గడచిపోయాయి. నా స్టుడియో ప్రక్కన కొరిటాల వెంకటేశ్వర రావుగారి కుటుంబం ఉండే వారు నన్ను ఎంతో ఆదరించారు. వారికి ముగ్గురు ఆడపిల్లలు. మాధవి, మల్లేశ్వరి, పద్మావతి. అందరూ చదువుకున్నారు. నాకు 26 సంవత్సరాల వయస్సులో మల్లేశ్వరి, నేను వివాహం చేసుకోవాలనుకున్నాము. మొదట మా యింటి వారు, మా చుట్టాలు ఈ పెళ్ళికి ఒప్పుకోలేదు కానీ ఒక సంవత్సరం తర్వాత ఒప్పుకున్నారు. 1989 మే 14న మల్లేశ్వరితో నా వివాహం జరిగింది. మా తండ్రిగారు కొంత ధన సహాయం చేసిన తర్వాత నేతాజి ఫోటో స్టూడియోని ప్రారంభించాను. మా తండ్రిగారు అస్వస్థతకు గురైనారు. అప్పుడు ఆస్తి పంపకాల విషయం ప్రస్తావన వచ్చింది. ఆస్తి పంపకంలో మా తండ్రి గారు తనకు సహాయకుడిగా ఆయనను అంటి పెట్టుకొనియున్న నా తమ్ముని పక్షము వహించి నాకు అన్యాయ ము చేసినట్లుగా నేను భావించాను. అందువల్ల మా మధ్యలో విబేధాలు పెరిగాయి.

ఒకసారి పొలములో నాకు, మా తమ్ముడికి, మా తండ్రికి ఘర్షణ జరిగి నేను గాయపడి పొలములో పడి పోయాను. ఈ సంగతంతా చూసిన గుడికందుల మోషే అనే దేవుని బిడ్డ నన్ను ఆదరించాడు. మోషే రజకుల కులములో పుట్టి అన్యునిగా ఉండి యేసునామమున రక్షణ పొంది తను తన సంపాదన చూసుకుంటూనే అనేకులకు యేసు సువార్తను అందించేవాడు. మోషే నాతో మాట్లాడుతూ 'నీ కొరకు నేను చాలా ఆలోచించాను. రమేష్ నాకు కావాలి, రమేష్ కొరకు నువ్వు ప్రార్ధన చెయ్యి అని యేసు చెప్పాడు. కనుక నువ్వు యేసును గురించి తెలుసుకో' అని నాకు ఒక క్రొత్త నిబంధన ఇచ్చాడు. నేను అది చదవటం ప్రారంభించాను. నాకు యేసును గురించి చెప్తున్నంతసేపు నా మనసు నెమ్మదిగా ఉండేది. మోషే వెళ్ళిపోయిన తర్వాత నిరుత్సాహంగా ఉండేది. నేను బహిరంగంగా బైబిలు చదవటానికి కాని, ప్రార్ధనలకు వెళ్ళటానికి కాని భయపడేవాడిని. మా కులస్తులకు భయ పడేవాడిని. మోషే వాక్యము చెప్పేటప్పుడు ఇంటి తలుపులు

వేసేవాడిని. నేను యేసు విషయంలో ప్రజలకు భయపడటం చూసి మోషే తన సాక్ష్యము ఇలా చెప్పాడు.

నా అసలు పేరు శ్రీను. మా తల్లిదండ్రులు యేసును నమ్ముకొని కులం వారి వలన చాలా బాధలు శ్రమలు అనుభవించారు. నాకు 14వ సంవత్సరములో మెదడు వాపు వ్యాధి వచ్చింది. నర్సరావుపేటలోని మట్టి పెద్దయ్య హాస్పటల్లో చేర్చారు. అక్కడ 14 రోజులు ముక్కులో గుండా ద్రవ ఆహారం పెట్టించి వైద్యం చేయించినా చనిపోయాను. తెల్లవారి నాలుగు గంటలకు చనిపోతే డాక్టరుగారు శవాన్ని ఇంటికి తీసుకొని వెళ్ళమని చెప్పి వెళ్ళిపోయాడు. అయితే మా అమ్మ తను ఒంటిరిగా ఇంటికి వెళ్ళి దేవుని ప్రార్థించి ఉదయం 11 గంటలకు డాక్టరుగారి దగ్గరకు వెళ్ళి 'అయ్యా నా కుమారుని మరోసారి పరీక్షించండి, మా యేసయ్య చనిపోయి న లాజరును మూడు రోజుల తర్వాత మరలా బ్రతికించాడు. నా కుమారుని కూడా బ్రతికిస్తాడు' అని చెప్పి, డాక్టరును బ్రతిమాలి 'అయ్యా నేను మీ గుడ్డలు చాలాకాలంగా ఉతుకుతున్న మీ చాకలిని. కనీసం అందుకు కృతజ్ఞతగా అయినా నా కుమారుని ఒక్కసారి పరీక్షించండి' అని డాక్టరు కాళ్ళు పట్టుకొని ఏడ్చింది. డాక్టరు మరలా హాస్పిటల్‌కి వచ్చి శ్రీను చెయ్యి పట్టుకొని నాడి చూచి 'చచ్చిపోయాడు' అని చేయి వదలి వెళ్ళటానికి వెనుతిరిగి వాకిలి వద్దకు వచ్చి అటు చూస్తే శవం చెయ్యి కదిలింది. డాక్టరు వెనక్కు వచ్చి పరీక్షించి 'నీ దేవుడు గొప్పవాడమ్మా. చనిపోయిన నీ కొడుకును ఏడుగంటల తర్వాత మళ్ళీ బ్రతికించాడు' అని చెప్పి బజారులో ఒక మాత్ర కొనుక్కు రమ్మని వైద్యము ప్రారంభించాడు. తర్వాత నాకు ఒక సంవత్సరం మళ్ళీ మాటలు నేర్పించి బాగు చేశారు. కనుక – రమేష్ యేసుప్రభువు శక్తిగల జీవముగల దేవుడు. నువ్వు ధైర్యంగా నిలబడు' అని చెప్పాడు.

నేను యేసుని హృదయంలో విశ్వసించాను కాని నా తండ్రి మీద, తమ్ముని మీద నా పగ రోజురోజుకు పెరుగు తున్నది. నా బొడ్లో కత్తి పెట్టుకొని తిరిగే వాడిని. ఎప్పుడైనా వీలు దొరికితే వారిద్దరిని చంపాలని నిశ్చయించుకొని గడ్డం పెంచటం ప్రారంభించాను.

గుంటూరు పట్టణంలో జాకబ్‌గారనే క్రైస్తవ సంస్థ అధిపతి, అమెరికా వారిని పిలిపించి మీటింగులు పెట్టించాడు. ఆ మీటింగులకు వెళ్దామని మోషే నన్ను ప్రేరేపించాడు. నేను కూడా వెళ్ళాలని నిశ్చయించుకొన్నాను. కాని నా పొలములో వరి కోతకు వచ్చింది. అప్పుడు మోషే సుబ్బారావు అనే యేసుని ఎరిగిన మరొక యౌవనస్తుడు నాకు కోత పనిలో సహాయపడి ముగించి గుంటూరు ప్రయాణమయ్యారు.

మీటింగుకు నన్ను తీసుకొని వెళ్ళుటకు మా యింటికి వచ్చారు. మీటింగులకు వెళ్తున్నారా? అని నేను వారిని అడిగాను. నేను రావడం లేదని వారు విని ఆశ్చర్య పోయారు. నా ప్రక్కనున్న నా భార్య, అదేంటి మిమ్మల్ని మీటింగులకు తీసికొని పోవాలని వీరు ఇంత కష్టపడితే అలా అంటారేంటి అన్నది. అప్పుడు మధ్యలో ఒక స్త్రీ కలుగ జేసుకోవడం నాకు కోప కారణమై చేతిలో బైబిలు ఆమె ముఖానికి తగిలేటట్లు విసరికొట్టి నేను మంచం మీద పడిపోయాను. ఈ హఠాత్ప రిణామానికి మోషే సుబ్బారావు ఇద్దరు వారి ఇండ్లకు వెళ్ళిపోయారు. ఆ రాత్రంతా నిద్రపట్టలేదు. నేను ఆరేళ్ళ బాలుడినైనట్లు, నా తలవెంట్రుకలన్నీ లేచి నిలబడి నట్లుగా అనిపించింది. తెల్లవారగానే లేచి మోషే సుబ్బారావుతో కలసి మీటింగుకు గుంటూరు వెళ్ళాను.

మూడవరోజు మీటింగులో బిల్‌పైపర్ అనే అమెరికన్ ప్రసంగిస్తు.... 'ఒక ప్రదేశములో ఒక పాస్టరు మంచి సేవ చేస్తుండగా ఆయనకు వ్యతిరేకముగాచాలామంది పోగై ఈ క్రైస్తవమత ప్రచారకుని చంపాలి అని అనుకొని పాస్టరు గారింటికి రాత్రి జామున వెళ్ళారు. పాస్టరు గారింటి తలుపు తట్టుచుండగా తన పసివాడైన కుమారుని ఎత్తికొని ఇంటి తలుపు తీయగానే ఆయనను కత్తితో పొడిచారు. ఆయన తన చేతిలోని కుమారుని తన భార్య చేతికిచ్చి చనిపోతూ 'నన్ను పొడిచిన వారిని క్షమించుము' అని చెప్పాడు.

ఈ ప్రసంగము వింటున్న నా మీదకు బలమైన శక్తివంటిది ఆవరించింది. నేను వెంటనే లేచి బయటకు వస్తుంటే నా ముఖంలోని మార్పు గమనించిన మోషే, సుబ్బారావు నా వెంట వచ్చారు. కాని నేను చాలా వేగంగా సాగిపోతున్నాను. కొందరు సువార్తికులు కూడా నా వెంట వచ్చి తమ చేతిలోని బైబిలు నా తల మీద పెట్టి ప్రార్థించ

నారంభించారు. అప్పుడు నేను మామూలు మనిషినయ్యాను. ఆ మధ్యాహ్నం ప్రార్ధనలో ఆత్మ నా మీదకు వచ్చి నీ పాపాలు ఒప్పుకో అని తొందర చేస్తుంది. అప్పుడు నేను నా సంగతి మోషేకి చెప్పి, మా ఊరు ఒంటరిగా వచ్చి నేరుగా మా తండ్రి ఇంటికి వెళ్తుంటే మూడు సంవత్సరాల తర్వాత తండ్రి ఇంటికి వస్తున్న నన్ను అందరూ వింతగా చూడసాగారు. మా ఇంటిలో నాయనమ్మ, అమ్మ, తమ్ముడు, నాన్న ఉన్నారు. వాళ్ళ దగ్గరకు వెళ్ళి ఏడుస్తూ నా తప్పులు క్షమించమని అడిగాను. అక్కడ నుండి ఇంటికి వచ్చి ప్రార్ధిస్తుంటే నా చిన్నతనపు పాపాలు అన్నీ నా ఎదురుగా ఉన్నాయి. ఒక స్వరము నా తప్పిదాలను ఒప్పుకోమని చెప్తుంది. మరొక స్వరము వీటిని ఒప్పుకోవద్దు అని చెప్తుంది. నా శరీరానికి శ్రమ, నా హృదయానికి ఆనందం కలిగాయి.

ఒక మధ్యాహ్నం పొలాలలో ప్రార్ధన చేసుకోవడానికి వెళ్తుంటే కంది చేనులో అపస్మారకము వచ్చి పడిపోయాను. జనం నాకు మూర్ఛ వ్యాధి వచ్చిందనుకున్నారు. ఆరు నెలల వయస్సున్న నా కుమారుని దేవునికి సమర్పించుకున్నాను. అంతకుముందు కంటే బైబిల్‌ను ఆసక్తిగా చదవటం, ప్రార్థించటం మొదలుపెట్టాను. మోషే సుబ్బారావులు మా ఇంటి ముందు ప్రార్ధన కూడిక పెట్టించారు. కూడిక అయిన తర్వాత అందరూ వెళ్ళిపోయారు. నేను నా గదిలోకి వెళ్ళి, 'నాయనా నేను కమ్యూనిష్టును. ఏదైనా చూస్తేనే కాని నమ్మను. నువ్వు నాకు దర్శనమివ్వు. లేకుంటే నాకు శక్తి రాదు' అని ప్రార్ధన చేస్తున్నాను. అకస్మాత్తుగా నా గదంతా వెలుగు మయమైంది. తెల్లని వెలుగు. ఆ వెలుగు నుండి 'నీవు నన్ను చూడలేవు. నీ నోటి ద్వారా నేను నిన్ను వాడుకుంటాను' అని వినిపించాయి.

అప్పటి నుండి దేవుని వాక్యము ప్రకటిస్తున్నాను. ఎవరినైనా నేను కలసికొనినప్పుడు వారి పాపాలన్నీ నాకు కనబడుతుండేవి. నేను వారికి చెప్పినప్పుడు వారు నన్ను కొట్టేవారు. అప్పుడు నేను మా మామ అంటే మల్లేశ్వరి తండ్రి దగ్గరకు వెళ్ళి 'ఇక ఇక్కడ ఉండటం కష్టం ఇక్కడే వుంటే నీ కూతురు తాళి తెగిపోతుంది' అన్నాను. అప్పుడు ఆయన 'నాకు అలానే అనిపిస్తుంది. ముందు నువ్వు ఇక్కడ నుండి వెళ్ళు' అన్నాడు. ఆ సమయంలో పెదనందిపాడు నుండి నా మేనమామ చాగంటి శ్రీనివాసులుగారు వచ్చారు. ఆయనతో 'నన్ను ఇక్కడ నుండి తీసికొని వెళ్ళు' అన్నాను. ఆయన నన్ను తనతో తీసికొని వెళ్తుండగా, నాకు మతిభ్రమణం అని మా తండ్రి, తమ్ముడు, బంధువులు కలసి నన్ను గుంటూరు లోని మానసిక వైద్యశాలకు తీసికొని వెళ్ళారు. అప్పుడు డాక్టరుగారి దగ్గరకు వెళ్ళి జరిగిన సంగతంతా వివరించి చెప్పారు. డాక్టరుగారు కొన్ని మందులు ఇచ్చి పంపించారు. మందులు తీసికొని భార్యతో కలసి పెదనందిపాడు వచ్చి అక్కడ ఫోటో స్టూడియో పెట్టి ఒక సంవత్సరం అయిన తర్వాత నా భార్యని పుట్టింటికి పంపి హైదరాబాద్‌లో ఒక బైబిలు కాలేజిలో చేరి ఒక సంవత్సరం తర్ఫీదు పొంది పొనుగుపాడు వచ్చి భార్యను తీసికొని విజయవాడ వద్ద పెనుమాకలో కాపురం పెట్టి విజయవాడలో ఆర్టిస్టుగా పనిచేస్తూ దేవునిలో ఎదిగి, ఒకరోజు ఉపవాస ప్రార్ధనలో ఉండగా "ప్రభువగు యెహోవా ఆత్మ నా మీదకు వచ్చియున్నది. దీనులకు సువర్తమానము ప్రకటించుటకు యెహోవా నన్ను అభిషేకించెను" యెషయా 61:1 నా కళ్ళ ఎదురుగా పెద్ద అక్షరాలతో కనిపించాయి. ఇది దేవుని నడిపింపు అని తెలుసుకొని హైదరాబాద్‌లోని బిలివర్సు చర్చికి వెళ్ళి బైబిలు కాలేజిలో చేరాను. అక్కడ ప్రకాశం జిల్లా వాస్తవ్యులతో పరిచయమై సేవార్ధమై ప్రకాశంజిల్లా చవటపాలెం వచ్చి సేవ ప్రారంభించాను. అప్పుడు 8 సంవత్సరాల కుమారునితో నా భార్య నా వద్దకు వచ్చింది. ప్రభువు చిలంకూరులో సేవ చూపించాడు. రెండు సంవత్సరాలు చిలంకూరులో సేవ చేసిన తర్వాత మంచి సంఘము ఏర్పడినది. సంఘ సభ్యులే చర్చీని, నాకు నివాసమును కట్టారు. ప్రతి దినము దేవుడు తన ఆత్మతో నన్ను వాడుకొనుచు అనేక అద్భుతములు, సూచన క్రియలను జరిగించనారంభించాడు. నా కుమారుడు ఢిల్లీలో బి.టి.హెచ్. చదివి కేరళలో ఏషియన్ బైబిల్ కళాశాలలో బి.డి. చదివి సేవలో వాడబడుచున్నాడు.

1992లో రమేష్ అనే నా పేరును ఒక దైవదాసుని ద్వారా జోసఫ్ కిషోర్‌గా మార్చబడినది. స్త్రీల మధ్య నా భార్య సేవ చేయుచున్నది. ఆమె పేరు ఇప్పుడు ప్రకాశిని. మా కొరకు, మా సంఘము కొరకు ప్రార్థించండి.

**(11వ పేజి తరువాయి...)**

ఈ సంశయములో ఆమెయందు ఉద్భవించిన భావము ఈయన తప్పక క్రీస్తయి వుండుననియే. అనగా ఆయనలో ఆమె మెస్సియ్యాను కనుగొనినది. క్రీస్తని యెంచి తన సంశయమును తెలియజేసినది. ఇంత గొప్ప వేదాంత సత్యములను తెలియజేయగలవారెవరు? మెస్సియా మాత్రమే గదా! అందుకు యేసు నేనే ఆయనని సెలవియ్యగా సమరయస్త్రీ యేసుప్రభువులో ఇమిడియున్న క్రీస్తు విశ్వరూపమును తిలకించి తన జీవితమును ధన్యము చేసుకొనినది. వైరభావముతో మొదలిడిన సంభాషణ దైవభావముతో ముగిసింది. పరుల కంటబడక కుండతో బావి వద్దకు వచ్చినపడతి – కుండను ప్రక్కనబెట్టి పదిమందిని పిలుచుటకు పరుగులెత్తింది. ఊరికి వెరచిన ఇంతి ఊరునే కదలించింది. క్రీస్తుప్రభువును లోకరక్షకునిగా సమరయులకు పరిచయం చేసింది. తొలి సువార్తకురాలిగా చరిత్రలో తన స్థానం అలంకరించింది.

ప్రియ పాఠకా! పరిస్థితులు ఆమెని పతితగా చేసినప్పటకీ ప్రభువు సందర్శనము ఆమెను పునీతగా మార్చింది. మన జీవితములు కూడా అంతే! ఒకవేళ నీవింకను బావిచెంత యున్నట్లయితే ప్రభువును కలుసుకో. ఆయన వేచియున్నాడు. నీ జీవితము మార్చబడి నీవు అనేక మందికి ఆశీర్వాదము కాగలవు.

ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా
చందా పంపించాలంటే
ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

Scan & Pay Using PhonePe App

Samuel Rajendra

**<u>చందాదారుల వివరములు</u>**

1. ప్రసాద్‌రావు గారు ( హైదరాబాద్) మొదటి నుండి కిరణ్ అనే పేరున పత్రికను పోషిస్తున్నారు.
2. డా॥ వినయ్‌కుమార్ (ఇ.యన్.టి అపోలో) – 5000 (ప్రతి సం॥ము)
3. డా॥. బి. ఉషా సతీష్ గారు (నెల్లూరు) – 2000 (ప్రతి సం॥ము)
4. దానం. మెర్సీ ఇశ్రాయేల్ గారు (నెల్లూరు) – 1000 (ప్రతి సం॥ము)
5. అపో. ఎబినేజర్ గారు (హైదరాబాద్) – 1500 (ప్రతి నెల)
6. దాసరి పాల్ – 3000 (ప్రతి నెల)
7. గంధం. డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) –1000 (ప్రతి నెల)
8. ముద్ద. సామ్యేల్ విల్సన్ – 500 (ప్రతి నెల)
9. జి. స్టాలిన్ (కావలి)
10. పాస్టర్ కంచెర్ల ప్రభుదాస్ (గుంటూరు)
11. సుమతి చక్రవర్తి
12. దాసరి. మాధవరావు


**K. Samuel Rajendra, SBI Collector Office Branch, Ongole**

**A/c No. 10957294362**

చిన్నపిల్లల పేజి

# సృష్టి క్రమము

ప్రారంభంలో మనం ఇప్పుడు చూస్తున్న ఈ ప్రకృతిలోని చెట్లు చేమలు, జంతువులు పక్షులు, నదులు సముద్రాలు, ఆకాశం, నీరు, కొండలు, లోయలు, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, మనుషులు ఏమీ లేవు. కేవలం భూమి, ఆకాశం, నీరు తప్ప ఇంకేమి లేవు. అంతా శూన్యంగా ఉండేది. భూమి కూడా ఇప్పుడున్నట్లు గుండ్రంగా కాకుండా ఆకారం లేనిదిగా ఉండేది. భూమి అంతా నీటితో కప్పబడి ఉంది. ఆ నీటి మీద దేవుని ఆత్మ సంచారము చేస్తూ ఉంది. దేవుడు ఒక కార్యము చేయడానికి పూనుకున్నాడు. అదే మనుష్యులను చేయడం. మరి మనుష్యులను చేయ్యాలంటే, వారు జీవించటానికి తగిన పరిస్థితులను కల్పించాలి కదా! కాబట్టి మనుష్యులను సృజించటానికి ముందే, వారికి అవసరమైన వాటన్నిటిని చేయడానికి పూనుకున్నాడు దేవుడు.



మనుష్యులు నివసించాలంటే వెలుతురు ఉండాలి కదా! అందుకని దేవుడు "వెలుగు కలుగుగాక" అని పలికాడు. వెంటనే వెలుగు కలిగింది. అది చూసి ఆయన సంతోషించాడు. అప్పుడాయన చీకటిని, వెలుగును వేరు చేశాడు. వెలుగుకు "పగలు" అని, చీకటికి "రాత్రి" అని ఆయన పేరు పెట్టాడు. రాత్రి గడచి, తెల్ల వారింది. అంటే ఒకరోజు గడిచిందన్న మాట. **అది మొదటి రోజు**. అప్పుడు దేవుడు భూమి మీద ఉన్న నీటి మధ్యలో విశాలము కలగాలి అని పలికాడు. అప్పుడు భూమి మీద నీరు రెండుగా విడిపోయి సగం నీరు పైకి వెళ్ళాయి. పైన ఉన్న నీటికి క్రింద ఉన్న నీటికి మధ్యలో ఉన్న విశాలానికి "ఆకాశము" అని పేరు పెట్టాడు దేవుడు. రాత్రి గడిచి, ఉదయం అయ్యింది. **అది రెండో రోజు**.

అప్పుడు దేవుడు "ఆకాశం క్రింద ఉన్న నీరంతా ఒక చోటికి వచ్చి ఆరిన నేల కనిపించుగాక" అని అన్నాడు. అది అలాగే జరిగింది. అప్పుడు ఆయన ఆరిన నేలకు "భూమి" అనీ, కూర్చబడిన నీళ్ళకు " సముద్రం" అని పేరు పెట్టాడు. అది దేవునికి సంతోషం కలిగించింది. అప్పుడు ఆ ఆరిన నేల మీద "అన్ని రకాల మొక్కలని, కొన్ని ధాన్యపు గింజలిచ్చే వాటిని మరికొన్ని పండ్లు ఇచ్చే వాటిని భూమి మీద మొలుచును గాక" అని అన్నాడు. అలాగే జరిగింది. ఇది దేవునికి ఆనందం కలిగించింది. రాత్రి గడిచి మళ్ళీ తెల్లవారింది.

**అది మూడో రోజు**. అప్పుడు దేవుడు పగలును రాత్రిని వేరు చేయడానికి ఆకాశంలో జ్యోతులు కలిగి, భూమికి వెలుగు ఇవ్వటానికి అవి ఆకాశంలో ప్రకాశించాలి. పగలు వెలుగివ్వటానికి పెద్ద జ్యోతి అనగా సూర్యుడు, రాత్రి పూట వెలుగివ్వటానికి చిన్నజ్యోతిని అనగా చంద్రుడుని ఇంకా నక్షత్రాలని కూడా దేవుడు చేశాడు. అవి రోజుల్ని, ఋతువుల్ని, సంవత్సరాల్ని కూడా సూచించాలి అని చెప్పాడు. అలాగే జరిగింది. రాత్రి గడిచి, తెల్లవారింది. **అది నాలుగో రోజు**. అప్పుడు దేవుడు "నీటిలో రకరకాల జీవరాసులు, వాటితో పాటు గాలిలో ఎగిరే రకరకాల పక్షులు కలుగును గాక" అన్నాడు. అది అలాగే జరిగింది. దేవునికి సంతోషం కలిగించింది. దేవుడు వాటిని 'మీరు ఫలించి అభివృద్ధి చెంది సముద్రంలో నిండండి అని చేపలను, భూమి మీద విస్తరించుడి అని పక్షులను దీవించాడు. సముద్రంలో ఉన్న ప్రతి జీవికి, ఆకాశంలో ఎగిరే పక్షులకు వాటి పోలికల్లోనే పిల్లలు పుట్టాయి. మళ్ళీ రాత్రి గడిచి, తెల్లవారింది. **అది ఐదో రోజు**. చివరిగా దేవుడు అన్ని రకాల

జంతువుల్ని అనగా పశువులను, అడవి జంతువులను, ప్రాకే పురుగులను చేసి, వాటిని చూసి సంతోషించాడు. జంతువులను, పురుగులను చేసిన తరువాత దేవుడు "ఇప్పుడు మనం మనుష్యుల్ని చేద్దాం. వారు మనలా ఉంటారు. వారికి చేపలు, పక్షుల మీద అధికారం ఉంటుంది. అంతేకాక, జంతువులన్నిటి మీద – అంటే పెద్ద, చిన్న, సాధు, క్రూర జంతువులు అనే తేడా లేకుండా అన్నిటి మీద వారికి అధికారం ఉంటుంది" అన్నాడు. తనలాగే ఉండేటట్లు మనుష్యుల్ని చేశాడు. ముందుగా నేలమంటి నుండి మట్టి బొమ్మను చేసి ఆ మట్టిబొమ్మ నాసికా రంధ్రాలలో జీవవాయువును ఊదినప్పుడు ఆ మట్టిబొమ్మకు ప్రాణం వచ్చింది. దేవుడు ఆ ప్రాణం వచ్చిన మట్టిబొమ్మకు ఆదాము అని పేరు పెట్టాడు. ఆదాము దేవుడు సృష్టించిన అన్ని జంతువులకు, పక్షులకు పేర్లు పెట్టాడు. ఆదాము ఒంటరిగా ఉండటం చూసి, నరుడు ఒంటరిగా ఉండటం మంచిది కాదని, ఆదాముకు గాఢనిద్ర కలుగజేసి, ప్రక్కటెముకను తీసి స్త్రీగా చేసి ఆదాముకు ఇచ్చాడు. ఆదాము ఆమెకు హవ్వ అని పేరు పెట్టాడు. దేవుడు వారిని దీవించి ఇలా అన్నాడు. "మీరు అనేకమంది పిల్లల్ని కనండి వారు భూమి మీద అంతటా జీవిస్తూ దానిని జాగ్రత్తగా చూడాలి. నేను మీకు చేపలు, పక్షులు, అన్ని రకాల జంతువుల మీద అధికారం ఇస్తున్నాను. మీరు తినడానికి అన్ని రకాల ధాన్యాల్ని, పండ్లనూ ఇచ్చాను. అలాగే జంతువులకు, పక్షులకు గడ్డి, ఆకులు ఆహారంగా ఉంటాయి" అని చెప్పాడు. దేవుడు తాను చేసినదంతా చూసి చాలా సంతోషించాడు. రాత్రి గడిచి, మళ్ళీ తెల్లవారింది, **అది ఆరో రోజు**. ఆ విధంగా "సృష్టిక్రమము" పూర్తయింది. మనిషిని చేయడానికి ముందే మనిషికి కావలసినవన్నీ దేవుడు చేశాడు. దేవుడు తాను చేసిన పని అంతటిని చూచినప్పుడు అది ఆయనకి మంచిదిగా కనిపించింది. ఇంక చేయడానికి ఏమి లేదు. కాబట్టి ఏడో రోజున ఆయన చేసిన పని అంతటి నుండి విశ్రాంతి తీసుకున్నాడు. అందుకని ఏడో రోజును ఆశీర్వదించి, పరిశుద్ధపరిచాడు.

దేవుడు మనుష్యులకు ఏవి అవసరమో అవన్నీ ముందుగా సృష్టించాడు. కాబట్టి ఇక మనం వేటి గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. దేవున్ని ఎరుగని ప్రజలే వాటి గురించి ఆలోచిస్తారు. కాబట్టి మనం మొదట దేవుని రాజ్యాన్ని, నీతిని వెదకాలి. మనకేం కావాలో మన తండ్రియైన దేవునికి తెలుసు కాబట్టి మన చింత యావత్తు దేవుని మీద వేసి ఆయనలో మనం ఆనందిద్దాం.


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, తెలుగు క్రైస్తవ సినిమాలు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు, క్రైస్తవ వివాహ వేదిక, మీ ప్రార్థన అవసరతల కొరకు ప్రార్థనా గది... ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlinetelugubible.net/www.onlinetelugubible.in**

**www.onlinetelugubible.net**

# ఘనపరచుట

***దేవుని ఘనపరచువాడు ఘనపరచబడును.*** మొదటిగా మనము తెలిసికొనవలసిన విషయమేమంటే దేవుడు మనలను నిర్మించుటకు కారణము ఆయనను ఘనపరచుట కొరకే. అందుకై దేవుని ఘనపరచుట మనందరి కర్తవ్యం. బైబిలు గ్రంథములో చదివినప్పుడు ఆయన సృష్టించిన ప్రతి ఒక్క ప్రాణమున్న జీవి, ప్రకృతి అంతా కూడా దేవుని స్తుతిస్తున్నట్లుగా చూస్తున్నాము. పరలోకములో వున్న దేవదూతలు కూడా నిరంతరము దేవుని స్తుతిస్తున్నట్లుగా చూస్తున్నాము.

యెషయా 55:12,13లో దేవుని ఘనపరచిన ప్రజలు ఏ విధంగా ఘనపరచబడుతారో అన్న విషయము చెప్పబడింది. "మీరు సంతోషముగా బయలువెళ్ళుదురు, సమాధానము పొంది తోడుకొనిపోబడుదురు. మీ యెదుట పర్వతములును మెట్టలును సంగీత నాదము చేయును, పొలములోని చెట్లన్నియు చప్పట్లు కొట్టును. ముండ్ల చెట్లకు బదులుగా దేవదారు వృక్షములు ఎదుగును". మనము ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నను మనలను ఆయన హెచ్చిస్తాడు. ప్రతి విధమైన అభివృద్ధి మానసికంగానూ, ఇహలోక విషయాల్లోనూ కలుగజేస్తాడు. ఇంకా యెషయా 43:2లో ఈ విధంగా వ్రాయబడి వుంది. "నీవు జలములలోబడి దాటునప్పుడు నేను నీకు తోడైయుండి నదులలోబడి వెళ్ళునప్పుడు అవి నీ మీద పొర్లిపారవు. నీవు అగ్నిమధ్యను నడచునప్పుడు కాలిపోవు, జ్వాలలు నిన్ను కాల్చవు". ఎంత గొప్ప వాగ్దానము కదా! పైన పేర్కొనబడిన విషయాలన్నీ ఆయన భక్తుల విషయాల్లో జరిపించి చూపాడు కాబట్టి మన జీవితాల్లో కూడా అలాంటి ఘనత పొందుట కొరకైన ఆసక్తితో ప్రయత్నించాలని కోరుచున్నాను.

రాజైన దావీదు తన కీర్తనల ద్వారా స్తుతించి యెహోవా దేవుణ్ణి ఘనపరచాడు. కీర్తనల గ్రంథములో ఎక్కువ కీర్తనలు రచించి చివరన "సకల ప్రాణులు యెహోవాను స్తుతించుదురు గాక, యెహోవాను స్తుతించుడి" అనే వాక్యంతో ముగించాడు. ప్రాణమున్న ప్రతి ప్రాణి దేవునిని స్తుతించాలని ఆయన కోరిక. కీర్తనలు 86:12లో "నా పూర్ణ హృదయముతో నేను నీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించెదను, నీ నామమును నిత్యము మహిమ పరచెదను" అని దేవునికి వాగ్దానము చేస్తున్నాడు. ప్రకటన గ్రంథము 4:10,11లో మనము చూసినప్పుడు పరలోకంలో ఆ దేవదేవుని సింహాసనము ఎదుట 24 మంది పెద్దలు సాగిలపడి వారి కిరీటములను ఆయన పాదముల యొద్దనేసి ఆయనను ఘనపరస్తూ ఉంటారని తెలుసుకుంటున్నాము. ఆయనే మహిమ, ఘనత, ప్రభావములు పొందనర్హుడని కూడా వ్రాయబడి యుంది.

మత్తయి సువార్త 15:8లో యేసుప్రభువు శాస్త్రులు, పరిసయ్యులలను గురించి మాట్లాడుతూ వారు తమ పెదవులతో తనను ఘనపరచుదురుగాని వారి హృదయము తనకు దూరముగా ఉన్నది అంటున్నారు. మనము ఆలాగు ఉండరాదని మిమ్ములను కోరుకొనుచున్నాను. మనము మనః స్పూర్తిగా దేవున్ని ఘనపరచినపుడే పైన పేర్కొన్న ఆశీర్వాదాలు పొందుకుంటాము. అపొస్తలుడైన పౌలు దేవుని వాక్యము బోధించుట ద్వారా దేవుని మహిమపరచేవాడు. ఏ పరిస్థితుల్లో నైనా దేవుని ఘనపరచ లేకపోయి నప్పుడు చాలా బాధనొందే వాడు.

**"దేవుని ఘనపరచుట ఎలా?"** అనే అంశము మీద కొన్ని విషయాలు పరిశీలిద్దాము.

1) మొదటిగా ఇచ్చుట ద్వారా దేవుని ఘనపరచవచ్చును. సామెతలు 3:9లో "నీ రాబడి అంతటిలో ప్రథమ ఫలమును నీ ఆస్తిలో భాగమును ఇచ్చి యెహోవాను ఘనపరచుము" అని వ్రాయబడియుంది. 10వ వచనములో తద్వారా వచ్చే ఘనత కూడా వ్రాయబడి వుంది. "అప్పుడు నీ కొట్లలో ధాన్యము సమృద్ధిగా నుండును, నీ గానుగలలో నుండి క్రొత్త ద్రాక్షారసము పైకి పొరలి పారును". దేవుని మహిమ పరచినపుడు మనము కూడా మహిమపరచబడతాము అనే

విషయానికి ఇది ఒక ఉదాహరణ. దేవునికి ఇచ్చుటలో చాలా జాగ్రత్త వహించవలెను. బైబిలులో వ్రాయబడియున్న ప్రకారము ఇవ్వాలి. రాబడిలో ప్రధమఫలము అని వ్రాయబడియుంది. మనము ఈ విషయం గురించి ఆలోచించినపుడు ఆదాము కుమారులు కయీను, హేబేలును గుర్తు తెచ్చుకోవాలి. ఆది.4:24లో చూచినపుడు కయీను పొలము పంటలో కొంతభాగము అర్పణగా తెచ్చినట్లు హేబేలు తన మందలో తొలిచూలున పుట్టిన వాటిని తెచ్చినట్లు చూస్తున్నాము. “యెహోవా హేబెలును అతని అర్పణను లక్ష్యపెట్టెను” అని వ్రాయబడి వుంది. హేబెలు దేవునికి ఇష్టమైన అర్పణను ఇచ్చుట ద్వారా దేవుని ఘనపరచినాడు.

2) బీదల మీద కనికరము చూపుట ద్వారా దేవుని మహిమపరచవచ్చును. సామెతలు 14:31లో “బీదను కనికరించువాడు ఆయనను ఘనపరచువాడు” అని వ్రాయబడి ఉంది. “విశ్వాసము క్రియలు లేనిదైతే మృతము” అని బైబిలు వాక్య ప్రకారము మనకు భక్తి, విశ్వాసము, ప్రేమ వుంది అని మాటల్లో చెప్పడము కాకుండా చేతల్లో చేసి చూపించాలి. మనకు అవకాశం దొరికినపుడెల్లా బీదలకు, అనాధలకు, విధవరాండ్రకు సాయం చేస్తే దేవుని ఘనపరచిన వారమౌతాము.

3) సబ్బాతు దినమును పరిశుద్ధముగా ఆచరించుట ద్వారా దేవుని ఘనపరుస్తాము యెషయా 58:13లో ఒక ఆదేశము, దానితోపాటు వచ్చే ఆశీర్వాదము, ఘనత ప్రస్తావించ బడ్డాయి. విశ్రాంతి దినమును దేవునికి ప్రతిష్ఠించి దేవుని సన్నిధిలో దేవుని ఘనపరచిన యెడల ఉన్నత స్థలములలోకి మనలను ఎక్కించెదననియు, యాకోబు స్వాస్థ్యమును అను గ్రహించి మనలను ఘనపరచెదనని దేవుడు వాగ్దానము చేయుచున్నాడు. ఆదివారము మనము మందిరమునకు వెళ్ళుటలో అశ్రద్ధ చేసిన యెడల మనకు రావలసిన ఘనతను పోగొట్టుకుంటామని తెలిసికొనుట మంచిది.

4) పరిశుద్ధ జీవితాలు జీవించుట ద్వారా దేవుని ఘనపరచ గలము. “నేను పరిశుద్ధుని కనుక మీరును పరిశుద్ధులుగా ఉండుడి” అని యెహోవా దేవుడు సెలవిచ్చియున్నాడు. కొండమీది ప్రసంగములలో యేసుప్రభువు ఈ విధంగా చెప్తున్నాడు. “హృదయశుద్ధి కలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు”. పరిశుద్ధులుగా ఉండుటకు మన ప్రార్ధనా జీవితం దోహదపడుతుంది. మనము పరిశుద్ధులుగా ఉంటూ మన జీవితాల ద్వారా దేవుని ఘనపరుస్తూ సాక్షులుగా జీవించాలి. మన శరీరము దేవుని ఆలయం కాబట్టి దానిని పరిశుద్ధంగా ఉంచుకొనుట మన కర్తవ్యం.

5) దేవుడు మన జీవితాల్లో చేస్తున్న అద్భుత కార్యాలను, మేలులను గురించి సాక్ష్యము చెప్పుట ద్వారా దేవునికి ఘనత కలిగించవచ్చు. కీర్తనలు 103:2లో దావీదు, “నా ప్రాణమా యెహోవాను సన్నుతించుము. ఆయన చేసిన ఉపకారము లలో దేనిని మరువకుము” అని వ్రాసియున్నాడు. “దేవునికి స్తుతియాగము చేయుము”, “స్తుతియాగము అర్పించువాడు నన్ను మహిమపరచుచున్నాడు” అనే వాక్యాలు కీర్తనలు 50వ అధ్యాయములో చూడగలము. మన జీవితాల్లో అనుదినము ఎన్నో మేలులు దేవుడు చేస్తుంటాడు. అవన్నీ ఇతరులతో చెప్పుట ద్వారా దేవునికి ఘనత.

6) దేవుని చిత్తప్రకారము చేయుటవల్ల దేవుని ఘనపరచ గలము. ఏ పని చేసినా దేవుని చిత్తప్రకారము చేయుట ద్వారా మనకు విజయము కలుగుతుంది. ఆ విజయాల వెనుకనున్న రహస్యము తెలిసికొని అన్యులు నిజమైన దేవుని దగ్గరకు వస్తే అది ఘనత.

7) సైతానుపై విజయము సాధించుట ద్వారా మనము దేవుని ఘనపరచగలము. ఎఫెసీ.6:10–17ల చెప్పబడిన ప్రకారము “అపవాది తంత్రములను ఎదిరించుటకు శక్తి మంతులగునట్లు దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించు కొనుడి”. సైతానుపై మనము విజయము పొందినప్పుడు దేవునికి మహిమ.

8) దేవుని సేవించుట ద్వారా ఆయనను ఘనపరచ వచ్చును: యోహాను 12:26లో యేసుప్రభువు ఈ విధంగా చెప్తున్నాడు. “ఒకడు నన్ను సేవించిన యెడల నా తండ్రి అతని ఘన పరచును”. మనకు దేవుడిచ్చిన తలాంతులను దేవుని సేవకై ఉపయోగించి తద్వారా ఆయనను ఘనపరచవలెను.

పాఠకులందరికీ జ్ఞానము దయచేసి చదివినదంతా మననము చేసికొని దేవుని ఘనపరచుటకు తీర్మానించు కుంటారని ఆశిస్తూ దేవుని ప్రార్ధిస్తున్నాము. ఆమేన్.

# లోకంతీరు

2

(పుట్టుక చావు మధ్య సంబరం)

**నా తల్లి గర్భమందు నన్ను నిర్మించిన వాడవు నీవే. నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయమును ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి.**

నేటి మానవులకి "డబ్బు" మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు లాంటిది. తన అవసరాలను తీర్చే దేవుడిని కాదని మనిషి డబ్బుని ఆశ్రయించటం దేవుని ఆజ్ఞని మీరటమే. ఈ డబ్బు సంపాదనలో దేవుడిచ్చే శాంతి సమాధానా లను, దేవుని సన్నిధిని కోల్పోయి ఈ లోకంలో నానా రకాల పాపాలను చేయడానికి దేవుడు మనిషికిచ్చిన తెలివితేటలను ఉపయోగిస్తున్నాడు. ***"ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము, కొందరు దానిని ఆశించి విశ్వా సము నుండి తొలగి పోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి"*** 1 తిమోతి 6:10. డబ్బును ప్రేమించే వారు దేవున్ని ప్రేమించలేరు. డబ్బును ప్రేమిస్తూ దేవునికి చందాలిచ్చేవారు దేవున్ని ప్రేమించి ఇస్తున్నారా? *ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు; అతడు ఒకని ద్వేషించి యొకని ప్రేమించును..... మీరు సిరికిని దేవునికి దాసులుగా నుండనేరరు.* మత్తయి 6:24. కాబట్టి డబ్బును ప్రేమించే వారు తమ డబ్బునిచ్చినంత మాత్రాన దేవున్ని ప్రేమించినట్లా? తమ ఘనతకోసమో, దేవుని దగ్గర్నుండి ఆశీర్వాదాలు ఆశించో లేదా దేవుడు ఏ కీడు రానీయకుండా వుండటం కోసమో ఇస్తున్నారనేగా అను కోవాల్సివస్తుంది.

> **పుట్టుక**
>
> **దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది.2:7)**

దేవుడు మనుష్యుల నుండి డబ్బును ఆశిస్తాడా? మరి దశమభాగము, కృతజ్ఞతార్పణల విషయం ఏంటి అనే అనుమానం వస్తుంది కదా! ఎవరైనా ఒక వ్యక్తి తాను కష్టపడి పనిచేసినందువల్ల వచ్చే డబ్బు తన ఒక్కడి కోసమే కాకుండా ఆ డబ్బుని తన కుటుంబంలోని ప్రతి ఒక్కరికోసం ఖర్చుచేస్తాడు. మరి దేవుని ప్రేమించే వారు, దేవుడు తన కుటుంబంలో ఉన్నాడనుకుంటే, దేవుడు తన సృష్టికర్త అని భావిస్తే తను సంపాదించే ప్రతి పైసాలో కొంత భాగం దేవుని కోసం ఖర్చు చేస్తాడు. కాబట్టి మనం దేవున్న ప్రేమిస్తున్నామో లేదో మన కష్టార్జితంలోనుండి దేవునికి భాగము ఇవ్వటంలోనే తెలుస్తుంది. దేవుడు ఆరోగ్యం ఇస్తేనే కదా ఒక మనిషి డబ్బు సంపాదించుకో గలుగుతున్నాడు. మరి మనకి ఆరోగ్యమిచ్చిన దేవునికి కృతజ్ఞతగా మన కష్టార్జితాన్ని దేవునికి పంచాలి. కాబట్టి మనిషి దేవున్ని ప్రేమిస్తున్నాడో లేదో తెలుసుకోడానికి ఈ దశమభాగ పరీక్ష. అంతే తప్ప ఈ లోకంలో సర్వసంపదలు సృష్టించిన దేవునికి ఆ డబ్బుతో అవసరం ఏమీ ఉండదు.

క్రైస్తవులు, అనగా క్రీస్తుని నమ్మిన వారు డబ్బుని ప్రేమిస్తే దేవున్ని (క్రీస్తుని) ప్రేమించి నట్లేనా, అలా డబ్బుని ప్రేమిస్తూ క్రైస్తవులని చెప్పుకొనేవారు దేవున్ని ప్రేమించగలరా? వారికి వారు కోరుకునే పరలోక రాజ్యం ప్రాప్తిస్తుందా? దేవున్ని మనం ఎరగటం కాదు, దేవుడు మనల్ని ఎరగాలి. *"ప్రభువా, ప్రభువా మేము నీ నామమున ప్రవచింప లేదా? నీ నామమున దయ్యములను వెళ్ళగొట్టలేదా? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు నేను - నేను మిమ్మును ఎన్నడును ఎరుగను; అక్రమము చేయువార లారా, నా యొద్ద నుండి పొండని వారితో చెప్పుదును"* మత్తయి 7:22,23. కాబట్టి దేవుని నామమున గొప్ప కార్యములు చేసే వారినే దేవుడు ఎరుగక పోతే, వారిని అనుసరించే క్రైస్తవులను మరి దేవుడు ఎరుగునా? ఎవరైతే దేవున్ని ప్రేమిస్తారో వారినందరిని దేవుడు ఎరుగుతాడు. డబ్బుని ప్రేమించే వారు దేవున్ని ప్రేమించలేరు కాబట్టి

దేవుడు వారిని ఎరుగడు. "ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడుకాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" మత్తయి 7:21.

ఒక యౌవనస్థుడైన ధనవంతుడు యేసుక్రీస్తు దగ్గరకు వచ్చి 'బోధకుడా, నిత్యజీవము పొందుటకు నేను ఏ మంచికార్యము చేయవలెనని ఆయనను అడిగెను. అందు కాయన -మంచి కార్యములను గూర్చి నన్నెందుకు అడుగు చున్నావు? మంచివాడొక్కడే. నీవు జీవములో ప్రవేశింప గోరిన యెడల ఆజ్ఞలను గైకొనుమని చెప్పెను. అతడు -ఏ ఆజ్ఞలని ఆయనను అడుగగా యేసు-నరహత్య చేయవద్దు, వ్యభిచరింప వద్దు, దొంగిలవద్దు, అబద్ధ సాక్ష్యము పలుక వద్దు, తల్లిదండ్రులను సన్మానింపుము, నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమింపవలెను అనునవియే అని చెప్పెను. అందుకు ఆ యౌవనుడు -ఇవన్నియు అను సరించుచునే యున్నాను; ఇకను నాకు కొదువ యేమని ఆయనను అడిగెను. అందుకు యేసు-నీవు పరిపూర్ణుడ వగుటకు కోరిన యెడల, పోయి నీ ఆస్తిని అమ్మి బీదల కిమ్ము, అప్పుడు పరలోకమందు నీకు ధనము కలుగును; నీవు వచ్చి నన్ను వెంబడించుమని అతనితో చెప్పెను. అయితే ఆ యౌవనుడు మిగుల ఆస్తిగలవాడు గనుక ఆ మాట విని వ్యసనపడుచు వెళ్ళిపోయెను. మత్తయి 19:16-22.

**చా వు**

**ఏలయనగా నేల నుండి నీవు తీయబడితివి; నీవు మన్నే గనుక తిరిగి మన్నైపోదువని చెప్పెను (ఆది.3:18)**

యేసు తన శిష్యులను చూచి-ధనవంతుడు పరలోక రాజ్యములో ప్రవేశించుట దుర్లభమని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. ఇదిగాక ధనవంతుడు పరలోకరాజ్యములో ప్రవేశించుట కంటే సూదిబెజ్జములో ఒంటె దూరుట సులభమని మీతో చెప్పుచున్నాననెను. శిష్యులు ఈ మాట విని మిక్కిలి ఆశ్చర్యపడి -ఆలాగైతే ఎవడు రక్షణ పొంద గలడని అడుగగా యేసు వారిని చూచి -ఇది మనుష్యులకు అసాధ్యమేగాని దేవునికి సమస్తమును సాధ్యమని చెప్పెను. మత్తయి 19:23-26.

కాబట్టి పై సందర్భాన్నిబట్టి చూస్తే మనుష్యులు చేసే నీతికార్యములనుబట్టికాక హృదయపూర్వకముగా దేవుని ప్రేమించుటనుబట్టియే రక్షణ ప్రాప్తిస్తుంది. ధనమును ప్రేమించే హృదయంతో దేవున్ని వెంబడించటం అసాధ్యం. ఆలాగైతే ఎవడు రక్షణ పొందగలడని శిష్యులు ఆశ్చర్యం వెలిబుచ్చడంలో అర్థం, ఆలాగైతే ప్రపంచంలో ఎవడు రక్షణ పొందగలడు, ప్రపంచమంతా అలాగే వుంది కదా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అప్పుడు యేసు ప్రభువు -ఇది మనుష్యులకు అసాధ్యమే కాని దేవునికి సమస్తమును సాధ్యము అని చెప్పాడు. యేసుప్రభువు కాలంలోనే అంటే ఇప్పుడున్న విలాసవంతమైన జీవితం లేని కాలంలోనే అలాంటి పరిస్థితి వుంటే, ఇప్పటి కాలంలో అది ఇంకెంత అసాధ్యము. అయితే నేటి కాలంలో మనుష్యులు తమంతట తాముగా డబ్బు నుండి తప్పించుకోవడం అసాధ్యమే కాని దేవున్ని ఆశ్రయించిన వారికి ఆయన తప్పక ధనాపేక్ష నుండి విడుదల దయచేస్తాడు. కాబట్టి ఈ లోకంలో మనిషి జీవించడానికి డబ్బుని ఆశ్రయించకుండా దేవున్ని ఆశ్రయించినట్లయితే, దేవుడు ఈ లోకంలో జీవించడానికి తగిన ధైర్యాన్నిచ్చి, వారి అవసరా లన్నీ తీర్చగల సమర్థుడు.

ఈ లోకంలో పుట్టిన తర్వాత ఒక మనిషి ఈ భూమ్మీద బ్రతికే కాలం దేవుడు నిర్ణయించిన ప్రకారం 70 లేదా 80 సం॥లు. ప్రతి మనిషీ తన జీవితకాలం మొత్తంలో ఎన్నో స్టేజీలు దాటుకుంటూ వెళ్ళాలి. బాల్యం, యవ్వనం, కౌమార్యము, వృద్దాప్యం. ప్రతి మనిషి ఈ స్టేజీలన్నీ దాటుకుంటూ వెళ్ళాల్సిందే. ఏ స్టేజీ నుండి మనం దేవునితో జీవిస్తామో అక్కడ నుండి మన జీవితం నల్లేరు మీద నడకలా సాగిపోతుంది. ఎలాంటి బాదరబందీలు లేని జీవితం దేవుని వలన మాత్రమే వస్తుంది. మొదటగా మనం మన జీవితాల్లో దేవునికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో దాని ప్రకారమే మన జీవితం సాగిపోతుంది. అంటే చాలామంది దేవునికి తమ జీవితాల్లో ఇచ్చే చోటు చాలా తక్కువ.

**(ఇంకా వుంది)**

## కొడవటికంటిగారి రచనలు

| | | | |
|---|---|---|---|
| 1. | మడిమెను పట్టుకొనినవాడు | రూ. | 40 |
| 2. | జప్పత్పనేహు | రూ. | 45 |
| 3. | ఆసెనతు | రూ. | 150 |
| 4. | అపొస్తలుడు | రూ. | 60 |
| 5. | బర్నబా | రూ. | 30 |
| 6. | తిమోతి | రూ. | 40 |
| 7. | నా చిత్తానుసారుడు | రూ. | 110 |
| 8. | గుంట నుండి మింటికి | రూ. | 50 |
| 9. | విశ్వాసంలో ఓ మెట్టు | రూ. | 60 |
| 10. | విశ్వాసంలో మరో మెట్టు | రూ. | 65 |
| 11. | తోటలో పనివాడు | రూ. | 20 |
| 12. | గోత్రకర్త (యాకోబు) | రూ. | 50 |
| 13. | నా కుటుంబము | రూ. | 25 |
| 14. | నా దూత (బాప్తిస్మమిచ్చు యోహాను) | రూ. | 50 |
| 15. | నా కుమారి (రూతు) | రూ. | 60 |
| 16. | నా స్నేహితుడు | రూ. | 50 |
| 17. | అంత్యదినములలోని యదార్ధ ప్రవక్త | రూ. | 50 |
| 18. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -1 | రూ. | 65 |
| 19. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -2 | రూ. | 65 |
| 20. | ప్రయాణంలో ఓ మజిలి | రూ. | 65 |
| 21. | నాజరు (సమ్సోను జీవిత చరిత్ర) | రూ. | 65 |
| 22. | సువార్తలలోని యేసుకథ | రూ. | 75 |
| 23. | యేసుకథ రెండవ భాగం | రూ. | 75 |
| 24. | యేసుకథ మూడవ భాగం | రూ. | 75 |
| 25. | జీవనమంతయు | రూ. | 40 |
| 26. | టాల్‌స్టాయ్ కథలు 1 భాగము | రూ. | 65 |
| 27. | టాల్‌స్టాయ్ కథలు 2వ భాగము | రూ. | 65 |
| 28. | ఓ చినుకునవుతా... | రూ. | 30 |
| 29. | విశ్వాసము విజయము-1 | రూ. | 70 |
| 30. | విశ్వాసము విజయము-2 | రూ. | 70 |
| 31. | విశ్వాసము విజయము-3 | రూ. | 70 |
| 32. | హదస్సా | రూ. | 70 |
| 33. | పరలోకము - నరకము | | |


పుస్తకములు కావలసినవారు :

**రెవ. డా॥ కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర**

కృపాదానంగారివీధి, క్లౌపేట, 6వ లైను,

ఒంగోలు-523001, ప్రకాశం జిల్లా,

ఫోన్ : 9866716506, 9440217726


## సండేస్కూల్ మెటీరియల్

| | | |
|---|---|---|
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-1 | రూ. | 50/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-2 | రూ. | 35/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-3 | రూ. | 45/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్ | రూ. | 50/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-1 | రూ. | 35/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-2 | రూ. | 45/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-3 | రూ. | 50/- |
| మార్గము-వి.బి.యస్. మెటీరియల్ | రూ. | 25/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (ఒ.టి.) | రూ. | 20/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (యన్.టి.) | రూ. | 20/- |
| సండేస్కూల్ సాంగ్స్ బుక్ | రూ. | 40/- |
| సండేస్కూల్ డైరి | రూ. | 60/- |
| సండేస్కూల్ స్టోరీస్ బుక్-1 | రూ. | 25/- |
| సండేస్కూల్ స్టోరీస్ బుక్-2 | రూ. | 35/- |
| సండేస్కూల్ టీచర్స్ గైడ్ | రూ. | 40/- |
| సండేస్కూల్ స్కిట్స్ | రూ. | 35/- |
| సండేస్కూల్ మెమోరి వర్సెస్ బుక్ | రూ. | 10/- |
| సండేస్కూల్ స్టిక్కర్స్ (32 ప్యాక్) | రూ. | 160/- |

### సండేస్కూల్ గేమ్స్

| | | |
|---|---|---|
| బైబిల్ ఇండెక్స్ గేమ్ | రూ. | 200/- |
| బైబిల్ ఫ్యామిలి నేమ్స్ గేమ్ | రూ. | 200/- |
| బైబిల్ నేమ్స్ గేమ్ | రూ. | 300/- |
| బైబిల్ వర్సెస్ స్టార్ గేమ్ | రూ. | 250/- |
| బైబిల్ నేమ్స్ ప్రిడిక్షన్ గేమ్ | రూ. | 120/- |
| బైబిల్ క్విజ్ గేమ్ | రూ. | 300/- |
| యానిమల్స్ అండ్ బర్డ్స్ ఇన్ బైబిల్ గేమ్ | రూ. | 300/- |
| హెవెన్ అండ్ హెల్ మెమోరి వర్సెస్ గేమ్ | రూ. | 350/- |
| ఫ్రూట్స్ ఆఫ్ స్పిరిట్ బోర్డ్ గేమ్ | రూ. | 350/- |
| ట్యాబర్‌నికల్ బోర్డ్ గేమ్ | రూ. | 350/- |
| ఈజిప్ట్ టు కానాన్ జర్నీ బోర్డ్ గేమ్ | రూ. | 350/- |


వివరాలకు : **బైబిల్ లిటరేచర్ మినిస్ట్రీ**

కృపాదానంగారివీధి, క్లౌపేట, 6వ లైను,

ఒంగోలు-523001, ప్రకాశం జిల్లా,

ఫోన్ : 9440217726